


Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

సమీక్షణము

సంపుటి: 81 • సంచిక: 31 • 30-7-2010 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-



విస్తరిస్తే వినాశనమే!

రాష్ట్ర మంత్రివర్గాన్ని విస్తరించాలనే ఒత్తిడి ముఖ్యమంత్రి రోశయ్య మీద తీవ్ర స్థాయిలో వస్తున్నది. మంత్రిత్వ ఆశావహులు ఆయన ప్రాణం తోడేస్తున్నారు. ఎంతకాలం ఎదురు చూడాలని నిష్ఠూరాలాడుతున్నారు. అయితే రోశయ్యలో మాత్రం కదలిక లేదు. మంత్రివర్గ విస్తరణ జోలికిపోతే ఒళ్లు కాలుతుందన్నది ఆయన భయం. తన మంత్రివర్గంలో అధికసంఖ్యాకులు వైఎస్ అనుచరులన్న నిజం ఆయనకు తెలుసు. వారు ఇప్పటికీ తనను ముఖ్యమంత్రిగా గుర్తించడం లేదని, క్యాబినెట్ సమావేశాలలో కూడా తుస్కారంగా మాట్లాడుతున్నారని ఆయన బాధపడుతున్నారు. వారిని నియంత్రించడం ఆయన తరం కావడం లేదు. వీరిలో కొందరినైనా పీకి పారేస్తే తతిమావారైనా భయంగా మసలుకొంటారని మొదట మొదట భావించారు. అయితే ఇప్పుడు పరిస్థితి మారింది. జగన్ ఓదార్పు యాత్ర విషయంలో అనూహిత నిగ్రహం పాటించడం ద్వారా మంత్రులందరూ రోశయ్యను ఇరకాటంలో పెట్టారు. మంత్రులంతా ఒద్దికగా మసలుకోవడం వల్లనే జగన్ యాత్ర విఫలమైంది. ఇప్పుడు ఏ కారణం వల్ల ఏ మంత్రిని వూడ బెరికినా, నేరుగా వెళ్లి జగన్ ఇంట్లో తల దాచుకొం

కొరవ 14వ పేజీలో

అయ్యో పాపం వైఎస్!


జగన్‌ను ఒంటరిని చేసిన ఎమ్మెల్యేలు, మంత్రులు.

వైఎస్.రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో గొప్ప నేత. ప్రత్యర్థులు కూడా ఆ వర్ణనను వ్యతిరేకించరు. ఆయనకు అపారమైన అభిమాన జనులున్నారు. లెక్కలేనంత మంది అనుచరులున్నారు. వారికాయన అడిగిందల్లా ఇచ్చాడు. కోరిన కోరికలన్నీ తీర్చాడు. అల్లాటప్పాగా తిరిగే వాళ్లను ఎమ్మెల్యేలను చేశాడు. అంట్లు తోమడానికి కూడా పనికిరారనుకొన్న వారిని మంత్రులుగా అందలం ఎక్కించాడు. కోట్ల రూపాయల ప్రభుత్వ ధనాన్ని దోచి పెట్టాడు. విలువ కట్టలేనంత ప్రజా ఆస్తులను కొల్లగొట్టి ఇచ్చాడు. ఆయన బ్రతికి వున్నంత కాలం ఆ అనుచరులు, అభిమానుల వరస చూస్తే, నిప్పుల్లో దూకమన్నా వెనుకా ముందు ఆలోచన చేయరన్పించేది. ఆయన కోసం ప్రాణం ఇస్తారనే భావన కలిగేది. ఆ సంతోషంతో ఆయన తన వారనుకొన్న వారి కోసం ఏ ప్రభుత్వ అధినేతా చేయకూడని తప్పులు చేశాడు. తన మనుషులను ఆనందపెట్టడంలోనే తన ఆనందం వుందనుకొన్నాడు. వారికి అట్లా ఉపకారాలు చేస్తూ చేస్తూ వున్నట్లుండి ఈ లోకం వదలి వెళ్లిపోయాడు. ఆ వియోగ దుఃఖాన్ని సాధారణ ప్రజలు సైతం భరించలేక పోతున్నారు. తలచుకొన్నప్పుడల్లా గుండెనెవరో మెలిపెట్టినంత బాధ పడుతున్నారు. ఆయన ప్రభుత్వం ఇచ్చిన పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు తీసుకొన్న మామూలు మనుషులే అంత విలవిలలాడిపోతుంటే, ఆయన పుణ్యాన పదవులు దక్కించుకొన్నవారు, అంతులేని అధికారం అనుభవించిన వారు, కోట్లకు పడగలెత్తినవారు, ఆస్తులు మూటగట్టుకొన్నవారు, అనుకొన్న పనల్లా నెరవేర్చుకొన్న వారు ఇంకెంత కుమిలి పోవాలి?


ఇప్పుడు జరుగుతున్నది అందుకు విరుద్ధం. వైఎస్ వారసుడిగా ఓదార్పు యాత్రకు బయలు దేరిన జగన్‌కు సాధారణ జనం బ్రహ్మరథం పడుతున్నారు. అర్ధరాత్రి, అపరాత్రి తేడా లేకుండా ఆయన కోసం ఎదురుచూస్తున్నారు. హారతులిచ్చి తమ అభిమానం చాటుకొంటున్నారు. కానీ జగన్ ఎంత అరిచి గీపెట్టుకొన్నా ఎమ్మెల్యేలు, మంత్రులు మాత్రం కనుచూపు మేరలో కన్పించడం లేదు. ఒక అంబటి రాంబాబు, ఒక సబ్బం హరి, ఒక కొండా సురేఖ, ఒక పిల్లి సుభాష్ చంద్రబోస్, మరొక చంద్రశేఖర్‌రెడ్డి... ఇట్లా వేళ్ల మీద లెక్క పెట్టగల్గిన సంఖ్యలోనే జగన్ పక్షాన నిలబడ్డారు. జగన్ ఓదార్పు యాత్ర ఉద్దేశం, ఎవరు ఔనన్నా ఎవరు కాదన్నా బలప్రదర్శన మాత్రమే. ముఖ్యమంత్రి పీఠానికి తానే వారసుడినని రాజశేఖర్‌రెడ్డి అంత్యక్రియలు కూడా ముగియక ముందే స్పష్టం చేశాడు జగన్. శవం ఇంట్లో వున్నప్పుడే ఎమ్మెల్యేల సంతకాలు సేకరించారు. ఆపద్ధర్మ ముఖ్యమంత్రి రోశయ్య మీద అక్కసు వెళ్లగక్కాడు.

కొరవ 14వ పేజీలో

కార్టూన్ స్కేప్



అన్ని ప్రశ్నలకి జవాబులు రాయకపోతే
నీ పాలనకు మార్కులెలా వేయనూ?!



[వెంకన్నకు నామాలు]

తిరుమల తిరుపతి దేవస్థానంలో జరుగుతున్న అక్ర మాలు, చెలరేగుతున్న వివాదాలు చూస్తుంటే దైవభక్తిపరులైన వారందరికీ మానసిక అశాంతి కల్గుతున్నది. తిరుమల వెం కన్న కోట్లాది మందికి ఇలవేల్పు. మానసిక ప్రశాంతత కోసం ఆయన్ను శరణువేడడం వేల సంవత్సరాలుగా వస్తున్న ఆచారం. లక్షల కోట్లు మూటగట్టుకొన్న అంబానీ సోదరుల నుంచి, పూటకు ఠికానీ లేని పేదవాడి వరకు తరతమ భేదాలు లేకుండా ఆ స్వామిని కొలుస్తారు. మొక్కులు చెల్లి స్తారు. కోరిన కోరికలు తీర్చమని ప్రార్థిస్తారు. శ్రీకృష్ణ దేవ రాయలంతటివాడు కూడా ఒకటికి ఎనిమిదిసార్లు తిరుమల కొండకు వచ్చి పోయాడని చరిత్ర చెప్తున్నది. దాన్నిబట్టే ఆ ఏడుకొండల వాడి మహాత్మ్యం పట్ల హిందువులలో వున్న అచంచల భక్తి పారవస్యాన్ని అర్థం చేసుకోవచ్చు. అంచనా వేసుకోవచ్చు. ప్రపంచంలో మరే ధార్మిక సంస్థకు కూడా ఇం తటి ప్రాసస్త్యం లేదు. ఇంత గొప్ప జన విశ్వాసం లేదు. విశ్వ వ్యాప్తంగా హిందు మతస్తుల జనాభా యాభై, అరవై కోట్లు దాటదు. కానీ తిరుమల కొండకు ఏడాదికి రెండు నుంచి మూడు కోట్ల మంది భక్తులు వస్తారు. ఆ మతవిశ్వాసంలో తిరుమల స్థానం అంత గొప్పది.

అయితే దురదృష్టవశాత్తు రాజకీయవాదుల దృష్టిలో టిటిడి పాలన వేరొకరకంగా వుంది. పలుకుబడి పెంచుకోవ డానికి, కోట్లు మూట కట్టుకోవడానికి, పెత్తనం చలాయించ డానికి, గొప్పతనం చాటుకోవడానికి తిరుమల దేవస్థానం ఒక ఉపకరణంగా భావిస్తున్నారు రాజకీయవాదులు. టిటిడి బోర్డు ఛైర్మన్లుగా, సభ్యులుగా నియమితులౌతున్న వారిలో దైవభక్తి కంటే ఈ స్వార్థమే ఎక్కువగా కన్పిస్తున్నది. ఆ పవిత్రమైన బాధ్య తకు ధార్మిక వర్తన, ఆధ్యాత్మిక భావన, సేవా దృక్పథం, స్వచ్ఛ మైన జీవితాలు అర్హతలుగా వుండాలి. కానీ అందుకు విరు ద్ధంగా రాజకీయాలలో రాటుదేలిన వారిని, అక్రమ సారాయి వ్యాపారాలు చేసేవారిని, కాంట్రాక్ట్ పనులతో ప్రభుత్వాన్ని దోచేవారిని, చివరకు నాస్తిక భావాలు కల్గిన వారిని కూడా టిటిడి బోర్డులో నియమిస్తున్నారు.

సేవల టిక్కెట్లను బ్లాక్ మార్కెట్‌లో విక్రయించడం దగ్గర నుంచి శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి విలువకట్టలేని నగల మాయం వరకు లెక్కలేనన్ని కుంభకోణాలు వెలుగు చూస్తు న్నాయి తిరుమల గుడి పాలనలో. మరొకప్రక్క ఛైర్మన్ ఆది కేశవులు నాయుడు, పలువురు సభ్యులు సంపన్నుల సేవలో తరిస్తూ సామాన్య భక్తులను అష్టకష్టాలు పెడుతున్నారు. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి, ఏళ్లతరబడి ముడుపులు కట్టిన సొమ్ముతో కొండమీదకు వచ్చే సగటు భక్తుడికి స్వామి దర్శనం దుర్లభంగా మారింది. గంటల తరబడి క్యూలో నిలబడి అతి కష్టం మీద గుడిలో ప్రవేశిస్తే, అర సెకనుపాటు కూడా దేము డిని చూసే అవకాశం లభించడం లేదు. అది కూడా మహా లఘు దర్శనం పేరిట ఫర్లాంగు దూరం నుంచి వెనుదిరగవల్సి వస్తున్నది. కంటి చూపు సరిగా ఆనని వారి పరిస్థితి మరింత దయనీయం. అదే సమయంలో వివిపి భక్తులకు మాత్రం తనివి తీరినంత సేపు దేముడి వాకిట నిలబడి చూసి తరించే భాగ్యం కల్గుతున్నది. అంబానీ, విజయమాల్య వంటి సంప న్నుల కోసం దేవాలయం తలుపులు బార్లా తెరుస్తున్నారు. అదేమని అడిగితే, వారు పెద్ద మొత్తాలలో విరాళాలిస్తున్నారని వాదిస్తున్నారు ధర్మకర్తలు. నిజానికి తిరుమల వెంకన్న రాబడిలో సంప న్నులు ఇచ్చే విరాళాలు చాలా కొంచెం. 1200 కోట్ల బడ్జెట్‌లో సామాన్య భక్తుల నుంచి వసూలయ్యేది 1100కోట్లకు పైగా వుంటుంది.

జమ్మిచైత్రు

తిరుమల దేవస్థానం ఇంతగా భ్రష్ట పట్టడం హిందు మతస్తుల విశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నది. ఈ పరిణామా లను ఇట్లనే కొనసాగించడం చాలా ప్రమాదకరం. టిటిడి బోర్డు సభ్యుల పట్ల తమకున్న రాజకీయ మొగమాటాలతో ప్రభుత్వం ఈ అక్రమాలను సహించడం దుర్మార్గమైన నేరం. ఇప్పటికే దీనిపై కోట్లాదిమంది భక్తులలో అసంతృప్తి భగ్గుమంటున్నది. అది దావానలం వలె వ్యాపించక ముందే ప్రభుత్వ పెద్దలు మేల్కొని, టిటిడిని స్వార్థపరుల చెర నుంచి తప్పించడం అవసరం. కొత్త బోర్డు నియామకం చేసేటప్పు డైనా ధార్మిక వర్తన కల్గిన వారికే అవకాశం ఇవ్వడం తప్ప నిసరి. మరొకసారి సారాయి వ్యాపారుల గుప్పెట్లో టిటిడిని పెడితే భక్తులలో తిరుగుబాటు తథ్యం.

జనవాణి

తెలుగు జాతిపై దాడి!

బాబ్లీ ప్రాజెక్ట్ సందర్శనకు వెళ్లిన తెలుగుదేశం పార్టీ అధినాయకుడు చంద్రబాబు, ఆ పార్టీ ఎమ్పీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మహారాష్ట్ర ప్రభుత్వం చూపించిన లాఠీ దెబ్బల రుచి మామూలు విషయమేమీ కాదు. బాబ్లీ వ్యవ హారం వెనుక రాజకీయాలు, ఇతర విషయాలు తీసి ప్రక్కన పెడదాం. మహా రాష్ట్ర సిఎం అశోక్ చవాన్ ఆదేశాల మేరకు మరాఠా పోలీసులు వ్యవహరిం చిన తీరును తెలుగుజాతి మొత్తానికి జరిగిన అవమానంగా భావించాల్సిందే. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం చేష్టలుడిగిన మాటలు మాట్లాడుతోంది. సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఈ సమస్యను పరిష్కరించుకోమని కేంద్ర జలవన రుల మంత్రి బన్సాల్ సలహా ఇవ్వడం బాధాకరం.

వాస్తు రామచంద్ర, నెల్లూరు

గతించిన వారి స్మృతిలో మొక్కను నాటండి!

శవాలను దహనం చేయడం హిందువుల ఆచారం. ఒక శవం పూర్తిగా కాలి బూడిద కావడానికి దరిదాపులు 125 కిలోల ఎండు కట్టె కావాలి. దీని కోసం దేశం మొత్తం మీద ప్రతి సంవత్సరం కొన్ని వేల చెట్లను నరికేస్తున్నారు. ఇందువల్ల వాతావరణ కాలుష్యం పెరిగిపోతూంది. కాబట్టి శవ దహనాన్ని నిషే ధించాలని ఉత్తరప్రదేశ్‌లో ఓ వ్యక్తి కోర్టును ఆశ్రయించాడు. అయితే ఇది పరి ష్కారం కాదు. కొత్తగా చెట్లను నాటి పెంచడం వుత్తమం. చనిపోయిన వారికి పుణ్యలోక ప్రాప్తికి వారి వారసులు పలు రకాల కార్యాలు చేస్తుంటారు. వాటిని చేస్తూనే స్మశానం వద్ద గాని, చుట్టుప్రక్కల గాని ఓ మొక్కను నాటి దాని పోషణ బాధ్యత స్వీకరించాలి. ఈ చర్య భావితరాల సంక్షేమానికి దోహదకారి అవు తుంది.

టి.కె.రెడ్డి, నెల్లూరు

రామతీర్థం బీచ్‌ను అభివృద్ధి చేయండి!

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం దగ్గర సముద్రతీరం ఎంతో సుందరంగా వుంటుంది. మొన్నటి రామలింగేశ్వరుని బ్రహ్మోత్సవాలకు లక్ష మంది ఒకే పూట స్నానమొనరించినా ఏ ఒక్కరికీ చిన్న ప్రమాదం సైతం సంభవించలేదు. రామ తీర్థం బీచ్‌ను అభివృద్ధి చేయను గతంలో పర్యాటక శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. కాని అవి అమలుకు నోచుకోలేదు. బకింగ్‌హామ్ కాలువపై వంతెన, రామతీర్థానికి వచ్చే వీరారెడ్డిపాళెం, అలగానిపాడు, ఊటుకూరు, విడవలూరు,

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

2-8-1940
పేజీలు : 16 వెల: అణా

నెల్లూరు ముచ్చట్లు

కాలేజీలోని నీళ్ల పోతగాడు

విఆర్ కాలేజిలో పిల్లలకు మంచినీళ్లు యివ్వడానికి ఒక ఏనుగుకాలు, కురుపులు కలిగిన ఆచార్యులను నియమించారు. కురుపులు, ఈగలు ముసరడం, అప్పుడప్పుడు కట్టు కట్టుకుంటూ ఆ చేతి తోనే నీళ్లు యివ్వడం యిలా జరుగుతున్నదని విద్యార్థుల కంప్లెయింటు.

ఓ గుడ్డి కమిటీ! నీవేమి చేస్తున్నావు? యమధర్మరాజుతో చెప్తా కపడ్దార్!

మునిసిపల్ హెల్త్‌ఫీసరు గారూ, మీరు తక్షణం వెళ్లి తనీఖీ చేసి నిజమైతే, వెంటనే మెడబట్టి నెట్టండి అవతల జూస్తాం మొగమాటాలుంటే.

కలెక్టరు మార్పు

ఎం.ఎం.గాన్‌గారు రెవిన్యూ బోర్డుకు పోతున్నాడు. 10వ తేది వీరికి బదులు కలెక్టరుగా సత్యనాధన్ గారు వస్తున్నారు.

1940లో మన తారల ఔన్నత్యం!

కన్నాంబ నటించిన చండిక దెబ్బతిన్నా ఈ మనోహర గేయిని మాత్రం ఒక మంచి సోకైన కారును కొన్నది.

కృష్ణవేణి యాక్టుచేసిన కాళిదాస డింకీ కొట్టినా ఈ యదృష్ట రాణి మాత్రం మంచి దివ్యమైన ఒక కారును కొన్నది.

అంటే లక్షల కొలది తగలేసి తలలు పట్టుకొని కూర్చున్న మన ప్రొడ్యూసర్లు యోగ జాతకాలు నసాళం అంటినా దమ్మిడీ పెట్టుబడి లేకుండా మనకూడు, మన గుడ్డతో నటించిన ఈ స్టార్ల నసీబ్ రేఖలు మాత్రం మిన్ను ముట్టాయి.

50 ఏళ్ల క్రితం ఈవారం

29-7-1960
పేజీలు: 12 వెల: 0-20 న.పై

రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షతకు అల్లూరి?

ఏ.సి.సుబ్బారెడ్డి గారిని మంత్రి వర్గం నుండి తొలగించినందువల్ల తమ కత్తికి ఎదురులేకుండా పోతుందని అల్లూరి సత్యనారాయణరాజు గారు భావించినట్లుంది గానీ, అదే తమకు తీరని చిక్కులు తెచ్చిపెడుతుందని ఊహించినట్లు లేదు. ఎన్నికల సంఘం ఎన్నిక కారణంతో సుబ్బారెడ్డిని వెళ్లగొట్టగలిగారే గానీ, ఆ ఎన్నికను నిల్పుకోలేక పోయారు. అట్లనే రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షత, మంత్రివర్గము అస్థిర పరిస్థితు లలో పడిపోయినవి. ఊహించకుండా సంభవించిన ఈ పరిణామాలను ఎదుర్కొనుటకు సత్యనారాయణ రాజు గారు మంత్రిత్వాన్ని వదలుకొని, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షతను చేపట్టాలనే ఆలోచనలో వున్నాడని 'విశాలాంధ్ర' పత్రిక హైదరాబాదు విలేఖరి వ్రాస్తున్నాడు.

ఇతర జిల్లాలు

తిరుపతిలో వైద్య కళాశాల

ఈ నెల 25వ తేదీన ఈ ఏడు కొత్తగా నెలకొల్పబడనున్న తిరుపతి వైద్య కళాశాలకు కాంగ్రెస్ అధ్యక్షుడు నీలం సంజీవరెడ్డి గారు ప్రారంభోత్సవం చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి పివిజి రాజు అధ్యక్షత వహించారు. కళాశాల నిర్మాణం, తదితర పరికరాలకు ఒక కోటి రూపాయలు ఖర్చవుతుంది. వైద్య కళాశాల, రూయా ఆసుపత్రి రెండూ 200 ఎకరాల స్థలంలో ఒకేచోట వుంటాయి. ఈ స్థలాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వారు దానం చేశారు. కళాశాలకు అనుబంధంగా 500 మంచాలతో ఐదు లక్షలు విరాళమిచ్చిన రామ్‌నారాయణ్ రూయా పేరుతో ఆసుపత్రి నిర్మించబడుతున్నది.

జూబిలిహిల్స్‌లో కాంగ్రెస్ విజయం

మెహిదీ నవాజ్ జంగ్ గుజరాత్ రాష్ట్ర గవర్నరుగా నియమితులైన కారణంగా ఖాళీయైన జూబిలీహిల్స్ శాసనసభ స్థానానికి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీమతి రోడామిస్త్రీ విశేష మెజార్టీతో ఎన్నికయ్యింది. ముస్లిములు అధికంగా గల ఈ నియోజకవర్గంలో ముస్లిమేతర(పార్సీ) మహిళ ఎన్నిక కావడం విశేషం.

నెల్లూరు ముచ్చట్లు

మూలపేట రోడ్డు ఎన్ని రోజులు వేస్తారు?

నెల్లూరు మూలపేటలోని పోలీస్ షాపింగ్ కాంప్లెక్స్ నుంచి సెంట్రల్ జైలు వరకు రోడ్డు వేసే పని గత మాసం రోజులుగా కొనసాగుతుంది. దీనివల్ల ఈ వైపున రాకపోకలు సాగించేవారు నానా పాట్లు పడుతున్నారు. డైకస్‌రోడ్డు మీదుగా పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు మూలపేటకు వెళ్లే రోడ్డు కూడా బాగా దెబ్బతినిపోయింది. నగరంలోని రోడ్లలో ఈ రోడ్డు కూడా చాలా ముఖ్య మైనది. దీన్ని తక్షణం పునర్నిర్మించాల్సిన బాధ్యత పాలకుల మీద వుంది.

మార్కెట్ సాయిబాబా గుడికి ఎ.సి!

నెల్లూరు ఎసి కూరగాయల మార్కెట్ ముందు రోడ్డును దురాక్ర మించి కట్టిన సాయిబాబా గుడికి అక్ర మార్కులు సరికొత్త హంగులు సమ కూరుస్తున్నారు. ఇటీవల ఈ గుడికి ఎసి సౌకర్యం పెట్టారు. నగరంలో బ్రహ్మాండ మైన సాయిబాబా గుడులున్నా ఎసి సౌక ర్యం మాత్రం మార్కెట్ సాయిబాబాకు దక్కింది. అంతా మార్కెట్ నాగేశ్వరరావు మహత్యం!

బంగారం స్పెషల్ ఆఫర్
BIS 916 హాల్‌మార్క్
బంగారు ఆభరణములపై
సవరకు రూ.400/- తగ్గింపు.
గ్రాముకు రూ.50/- తగ్గింపు.
డైమండ్స్ పై 10% తగ్గింపు.
గోల్డ్ ప్యాలెస్
హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీసు సెంటర్,
ఆచారివీధి, నెల్లూరు.
ఫోన్: 2331133, 2327611

సింహపురిలో మర్యాదరామన్న!

ఈవారంలో విడుదలైన మర్యాద రామన్న సినిమా యూనిట్ 27వ తేది నెల్లూరు వచ్చింది. సినిమా ఆడుతున్న కావేరి థియేటర్‌లో ప్రేక్షకులను కలుసు కొంది. అంతకు మునుపు ఈ సినిమా యూనిట్ బొల్లినేని ఆసుపత్రిలో ఆరో గ్యశ్రీ వార్డులోని రోగులను పరామర్శిం చింది. దర్శకుడు రాజమౌళి, హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ గిరినాయుడు మిత్రులు కావడంతో మర్యాద రామన్న యూనిట్ మర్యాద పూర్వకంగా అక్కడకు వెళ్లింది. ఈ సినిమాలో హీరో, హీరో యిన్లు సునీల్, సలోని, బ్రహ్మాజి, సంగీత దర్శకుడు కీరవాణి, దర్శకుడు రాజ మౌళి, ఆయన సతీమణి రమ వచ్చిన వారిలో వున్నారు.

బొల్లినేని పవర్ ప్లాంట్ మూసివేత


పొదలకూరు మండలం సూరాయ పాళెంలోని బొల్లినేని పవర్ ప్లాంట్‌ను మూసివేయమని జిల్లా కలెక్టర్ రాం గోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. 6.5 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే ఈ పవర్ ప్లాంట్‌లో కట్టెలకు బదులుగా పొట్టును వాడడంతో బూడిదరేగి సమీప ప్రాంత గ్రామాల ప్రజల కళ్లు దెబ్బతిన డంపై మీడియాలో వార్తలు రావడంతో కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకొన్నారు. చిన్న పవర్ ప్లాంట్‌నే బూడిద వెదజల్లి ఇంత గందరగోళం సృష్టించింది. రేపు కృష్ణప ట్నంలో ఏర్పాటవుతున్న వేల మెగావాట్ల పవర్‌ప్లాంట్లు ఏం చేస్తాయో... ఏమో!

అసెంబ్లీ బిసి సంక్షేమ కమిటీలో బీద, బూదాటి!

శాసనసభ, శాసన మండలి సభ్యు లతో ఏర్పాటైన బిసి సంక్షేమ కమిటీలో సభ్యులుగా కావలి శాసనసభ్యుడు బీద మస్తాన్‌రావు, శాసన మండలి సభ్యుడు బూదాటి రాధయ్య నియమితులయ్యారు. ఈ కమిటీకి శాసనసభ్యుడు గుండుమల తిప్పేస్వామి చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

వైస్ ఛాన్సలర్‌గా డాక్టర్ జగదీష్!

ప్రత్యామ్నాయ ఇంధన వనరుల నిపుణుడు, కవరైపేటలోని ఆర్ఎంకె ఇంజనీరింగ్ కాలేజిలో ప్రొఫెసర్ డాక్టర్ ఎ.జగదీష్ ఆస్ట్రేలియాలోని ఇన్‌స్టిట్యూట్



ఆఫ్ హై ఎనర్జెటిక్ మెటీరియల్స్, మోనాష్ యూనివర్శిటీలో వైస్ ఛాన్సలర్‌గా నియ మితులయ్యారు. ఈ సంస్థ వైజ్ఞానిక సాం కేతిక రంగాలలో పలు పరిశోధనలు చేస్తుంది. ప్రతి యేటా వివిధ రంగాల్లో సెమినార్లు, కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తుంది. డాక్టర్ జగదీష్ మనదేశం నుంచే నెట్ ద్వారా యూనివర్శిటీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తారు. అవసరమైతే ఆస్ట్రేలియా వెళ్తారు. ఆస్ట్రేలియా వంటి అభివృద్ధి చెం దిన దేశానికి సంబంధించిన యూనివర్శి టీకి ఒక నెల్లూరీయుడిని వైస్ ఛాన్స లర్‌గా నియమింపబడడం ఇదే ప్రథ మం. ఆయనకు మా అభినందనలు.

పెద్దాసుపత్రిలో పిల్లల ఆసుపత్రి!

నెల్లూరు పెద్దాసుపత్రిలో ప్రత్యే కంగా పిల్లల ఆసుపత్రిని ఐదు కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మిస్తామని తిరు పతి ఎమ్పీ చింతామోహన్ చెప్పారు. ఈ వారంలో ఆయన పెద్దాసుపత్రికి విచ్చేసి వివిధ వార్డులను పరిశీలించారు. తిరు పతి, నెల్లూరు పార్లమెంటు నియోజక వర్గాల పరిధుల్లో ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 100 కోట్ల రూపాయల నిధులు విడుదల చేసింద న్నారు. ఈ నిధులతోనే నెల్లూరు మద్రాస్ బస్టాండ్ వద్దగల జూబ్లీ హాస్పిటల్‌లో పడకల సంఖ్య కూడా పెంచుతామ న్నారు. నెల్లూరు పెద్దాసుపత్రిలో ప్రభుత్వ నేతృత్వంలో మెడికల్ కాలేజి ఏర్పాటుకు తగిన ప్రయత్నాలు చేస్తానన్నారు. నెల్లూరు నేతలతో సంబంధం లేకుండా 'చింతా' జరిపిన పర్యటన, వెల్లడించిన అంశాలు ఆసక్తిరేపాయి. మంచి చేస్తా మంటే వద్దనే వారు ఎవరుంటారు?

జయలలితను కలసిన బీద!

బాబ్లీ ప్రాజెక్ట్‌పై తెలుగుదేశం పార్టీ చేస్తున్న పోరాటానికి మద్దతు ఇవ్వమని చెన్నైలోని అన్నా డిఎంకె అధ్యక్షురాలు డాక్టర్ జయలలితను రాజ్యసభ సభ్యుడు సుజనాచౌదరి, కావలి ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు కలసి కోరారు. ఈ విష యంపై ఒక అవగాహనకు వచ్చి తన నిర్ణ యం తెలియజేస్తానని జయలలిత వీరితో అన్నట్లు తెలిసింది. బాబ్లీపై జాతీయ స్థాయిలో అన్ని పార్టీల మద్దతు కూడ గట్టే ప్రయత్నంలో భాగంగా తెలుగు దేశం పార్టీ ప్రతినిధి బృందం జయ లలితను కలిసింది.

పసల సన్మాయి నొక్కులు!

మాజీ మంత్రి పసల పెంచలయ్య చాలా రోజుల తర్వాత మళ్లీ గొంతు విప్పారు. ముఖ్యమంత్రి రోశయ్య, పిసిసి అధ్యక్షుడు డి.శ్రీనివాస్ తమ పదవులు కాపాడుకొనేందుకు నానాపాట్లు పడుతు న్నారే తప్ప పార్టీని గూర్చి పట్టించుకోవ డం మానేశారన్నారు. దీనివల్ల రాష్ట్రంలో


కొరవ 14వ పేజీలో

సంస్మృతి



మా అమ్మ
తూపిలి రమణమ్మ
(జమీన్‌రైతు మేనేజింగ్ ఎడిటర్
స్వర్గీయ తూపిలి పార్థసారథిగారి భార్య)
30.7.92
వనమాలి, ఉష, పేశల
మరియు
కుటుంబ సభ్యులు

అమ్మ ఫర్నిచర్స్
"A House of Life style furniture"
గృహాలంకరణకు కావలసిన అత్యాధునిక ఇంపోర్టెడ్ ఫర్నిచర్,
రాఘవ సినీకాంప్లెక్స్ రోడ్, నెల్లూరు. సెల్: 9246435616, 9849495615


కే॥శే॥ మాగుంట రాఘవరెడ్డి గారు

శ్రద్ధాంజలి

మా ఇంటి జ్యోతి, నిరంతరం మా హృదయాంతరాలలో వెలిగే ధృవతార
మా అభివృద్ధికి కారకులు, అనురాగంతో మమ్మల్ని తన గుండెలలో
దాచుకున్న ప్రేమమయుడు మా తండ్రి కే॥శే॥ మాగుంట రాఘవరెడ్డి గారు.
వారి పవిత్రాత్మకు మా శ్రద్ధాంజలి.

ఆ మహనీయుని 33వ వర్ధంతి సందర్భంగా
తేది 1-8-2010 ఆదివారం నెల్లూరు రంగనాయకులపేటలోని
శ్రీ రాఘవ కళ్యాణ మండపం నందు పేదలకు అన్నదానం జరుపబడును.

కుమారులు
మాగుంట సుధాకర్‌రెడ్డి
మాగుంట శ్రీనివాసులురెడ్డి, M.P.,

మనుమడు
మాగుంట విజయారెడ్డి
ట్రస్ట్‌బోర్డు సభ్యులు,
శ్రీతల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం, నెల్లూరు.



గట్టిగాలేని నెల్లూరు హెడ్ పోస్టాఫీసు.

దిక్కు దివాణంలేని పోస్టల్ శాఖ

పోస్టల్ శాఖ ఎంతగా విస్తరించి పోతున్నదో, పోస్టల్ రేట్లు ఎంతగా పెరిగిపోతున్నవో దాని సేవ దినదినానికి అంతగా దిగజారిపోతున్నది. అధ్వాన్నమై పోతున్నది. ప్రభుత్వ శాఖల్లో అత్యధికంగా ప్రజలకు సేవలందించే శాఖగా పోస్టల్ శాఖకు పూర్వం మంచి పేరుండేది. ఇప్పుడు ఆ మంచి పేరు లేదు సరిగదా ఇంత దగుల్బాజీ శాఖ లేదన్నంతగా మొహం మొత్తుతున్నది ప్రజలకు. నెల్లూరు నగరంలోని హెడ్ పోస్టాఫీసు, ఎకెనగర్ పోస్టాఫీసులు పేరుకు 'ఈ' పోస్టాఫీసు. కానీ సేవలు మాత్రం నామ మాత్రం. జిల్లాలోని అన్ని పంచాయితీలలో పోస్టాఫీసులున్నాయి. పాత రోజుల్లో నాలుగైదు పంచాయితీలకు కలిపి ఒక పోస్టాఫీసు వుంటే చాలా ఎక్కువ. అంత తక్కువ పోస్టాఫీసులు వుండేటప్పుడు హెడ్ ఆఫీసుల నుంచి సబ్ ఆఫీసులకు బస్‌లలోనూ, సబ్ ఆఫీసు నుండి బ్రాంచ్ ఆఫీసులకు రన్నర్స్ ద్వారాను; తపాలా సంచులు చేరుతుండిన కాలంలో, ఒక పోస్టాఫీసు క్రింద వున్న గ్రామాలు మూడు నాల్గు మైళ్ల దూరాన వున్నా పోస్ట్‌మ్యాన్ ద్వారా ఆ రోజు కాకున్నా మరురోజు జాబులు చేరుతుండేవి.

కొరియర్ సర్వీసులతో విపరీతమైన పోటీ ఎదుర్కొంటున్న ఈ రోజుల్లోనూ పోస్టల్ శాఖలో మార్పు రాలేదు. పాత రోజుల్లో నెల్లూరు నుంచి ఢిల్లీకి ఎయిర్‌మెయిల్‌లో 24 గంటలలోపు ఉత్తరాలు డెలివరీ అయ్యేవి. ప్రస్తుతం నెల్లూరు టౌన్‌లోనే ఒక డెలివరీ ఆఫీసు క్రింద పోస్టు చేసిన జాబు మరో డెలివరీ ఆఫీసు క్రింద బట్వాడా కావడానికి రెండు మూడు రోజులు పడుతున్నది. దీనికి నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేట, ఎకెనగర్ పోస్టాఫీసులు సజీవ సాక్ష్యాలు. ఇక హైదరాబాద్, చెన్నై, బెంగుళూరులకు జాబు, పత్రిక చేరాలంటే కనీసం వారం పది రోజులు పడుతుంది. దీనికి కారణాలు ఎవరూ చెప్పడం లేదు. పోస్టల్ శాఖలో పని ఒత్తిడి పెరగడం కాదు. పని పెరిగినంతగా ఉద్యోగుల సంఖ్య పెరగకుండడం కాదు. వేతనాల వల్ల నిరుత్సాహం కాదు. పనిచేసే ఉద్యోగుల్లో చిత్తశుద్ధి లోపించింది. నిర్బాధ్యత, నిర్లక్ష్యం ఎక్కువయ్యాయి. ఈ విషయాన్ని పోస్టల్ సూపరింటెండెంట్ ఒప్పుకొని తీరాల్సిందే. పరిస్థితులు చక్కదిద్దను మార్గాలు వెతకాల్సిందే.

అయోమయంలో డిఎస్సీ అభ్యర్థులు!

అధికారుల అసమర్థత, ప్రభుత్వ వైఫల్యం కలగలసి డిఎస్సీ అభ్యర్థులను త్రిశంకు స్వర్గంలో వుంచాయి. పోస్టింగ్ ఆర్డర్స్ చేతికొచ్చే సమయంలో నియామకాలపై కోర్టుకు వెళ్లడంతో మొత్తం ప్రక్రియలో ప్రతిష్టంబన నెలకొంది. 2008 సంవత్సరంలో డిఎస్సీ వ్రాసిన అభ్యర్థులలో సెకండరీ గ్రేడ్ పోస్టులు మినహా మిగతా పోస్టులకు నియామకాలు పూర్తయ్యాయి. ఆ సమయంలో ముఖ్యమంత్రిగా వుండిన వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి డిఎడ్ పూర్తిచేసిన అభ్యర్థులకు డిఎస్సీ నియామకాల్లో 30 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఉత్తర్వులిచ్చారు. దీనిపై పలువురు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో ఎస్‌జిటి నియామకాలు నిలచిపోయాయి. రెండేళ్ల అనంతరం తిరిగి ఈ పోస్టుల భర్తీకి ప్రభుత్వం సమ్మతించడంతో అన్ని జిల్లాల్లో కౌన్సిలింగ్ నిర్వహించి పలుచోట్ల నియామకాలు పూర్తి చేశారు. కానీ మన జిల్లావిద్యాశాఖ అధికారుల అసమర్థత, నిర్లక్ష్యం కారణంగా జాబితాలో తప్పులు దొర్లడం, ఒక ఉపాధ్యాయ సంఘం ఆందోళన చేపట్టడంతో జిల్లాలో టీచర్ల నియామక ప్రక్రియ ఆలస్యం అయ్యింది. ఈ సమయంలో 30 శాతం రిజర్వేషన్‌ను వ్యతిరేకిస్తూ కొందరు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు అభ్యర్థుల పక్షానే తీర్పు ఇవ్వడంతో సుప్రీం కోర్టు ముంగిటకు వెళ్లింది ఈ కేసు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం జోక్యం చేసుకొని స్టే కోరడమో, లేదా 30 శాతం రిజర్వేషన్ అమలు చేయడమో చేయకుండా మౌనంగా వుండడంతో డిఎస్సీ 2008 ఎస్‌జిటి అభ్యర్థుల పరిస్థితి త్రిశంకు స్వర్గమైంది. ఆయా పోస్టుల్లో చేరే లోపల అంతా తలక్రిందులై పరిస్థితి మొదటికి రావడంతో అభ్యర్థుల్లో తీవ్ర నిరాశ నెలకొంది.

ఎన్నాళ్లిలా...

అవినీతి అక్రమాల్లో కూరుకొన్న ఇందిరమ్మ!

నెల్లూరు నగరంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం అవినీతి అక్రమాల్లో కూరుకపోయింది. దీనికి ముమ్మాటికీ కారకుడు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డినే. లబ్దిదారుల ఎంపిక ప్రారంభమైన ఆరేళ్ల క్రితం నుంచి ఈ అవినీతి జమానా నడుస్తుంది. మొదటి విడతలో ఎంపికచేసిన 6,400 మంది లబ్దిదారుల్లో 2,500 పైగా బోగస్ పేర్లున్నాయి. ఇదంతా కాంగ్రెస్ కార్పొరేటర్లు చేసిన పని. దీని తర్వాతనైనా వివేకానందరెడ్డి మేలుకొని కార్పొరేటర్లను మంద లించలేదు. పిండి సురేష్, సంక్రాంతి కళ్యాణ్ వంటి కార్పొరేటర్లు, మహిళా కార్పొరేటర్లు వేలమూరి ఉషారాణి, షాలిని, సుభాషణమ్మల భర్తలు పేలమూరి రంగయ్య నాయుడు, బర్నా బాసులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ బాధ్యతలు అప్పజెప్పారు. పిండి సురేష్, సంక్రాంతి కళ్యాణ్ వంటి వారు కొత్తూరులోని ఇందిరమ్మ గృహ నిర్మాణ సముదాయాల్లోనే ఇటుకల పరిశ్రమలు పెట్టి నాసిరకం ఇటుకలు ఇళ్లకు అందించి ప్రాధమికంగా ఈ పథకాన్ని గబ్బుపట్టించారు. కట్టి ఏడాది కాకమునుపే ఈ గృహాలు అధ్వాన్నస్థితికి చేరి రెండు, మూడవ దశల్లో ఎంపిక చేసిన ఇందిరమ్మ లబ్దిదారులను హడలెత్తిస్తున్నాయి. ఇందిరమ్మ ఇళ్లలో ఒక్కరు చేరకపోయినా వీటిని కట్టిన, పనులు చేపట్టిన వివేకానందరెడ్డి అనుచరులంతా కోటీశ్వరులయ్యారు. ఈ విషయం బహిరంగ రహస్యం. కానీ ఈ వ్యవహారమై చర్యలు తీసుకొనే అధికారులే లేకుండా పోయారు. పథకంలో పారదర్శకత లేకపోవడం వల్ల బ్యాంకర్లు 30వేలు రుణ సదుపాయం అందించను ఆలోచిస్తున్నారు. ఇందిరమ్మ అవినీతి అక్రమాలపై దీక్షలు చేసిన సిపిఎం పార్టీ నేతలను తన పెద్ద నోటితో తిట్టి వివేకా సంబరపడి పోతున్నాడు గానీ ఇందిరమ్మ ఇళ్లలో చేరే ఆ లబ్దిదారులు జీవితాంతం తిట్టే తిట్లు మాత్రం ఆయన భరించక తప్పదు. ఈ తిట్లను సురేష్, సంక్రాంతి కళ్యాణ్, రంగయ్య నాయుడు, బర్నాబాసు పంచుకోరు బాస్!



కొత్తూరులో నాసిరకంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు.

కొండ దిగని కోడి మాంసం!

రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోళ్ల ఫారాలతోపాటు తమిళనాడు, ఒరిస్సాలలోనూ కోడిమాంసం ధరలు బాగా పడిపోయినా నెల్లూరు వ్యాపారులు మాత్రం మాంసాహార ప్రియులను ఇంకా దోచుకొంటున్నారు. 25వ తేది ఆదివారం దరిదాపులు అన్ని జిల్లాల్లో బాయిలర్ స్కిన్‌లెస్ మాంసం కిలో వంద రూపాయలకు అమ్మారు. కానీ నెల్లూరులో మాత్రం 120 రూపాయలకు ఏమాత్రం తగ్గించలేదు. ఎండలు విపరీతంగా వుండడం వల్ల జూన్, జులై మాసాలలో స్కిన్‌లెస్ కోడి మాంసం 170 రూపాయల గరిష్ట ధర పలికి రికార్డు సృష్టించింది. కానీ గత పక్షం రోజులుగా వర్షాలు పడుతుండడంతో కోడి మాంసం డిమాండ్‌కు తగ్గట్టు అందుబాటులోనికి రావడంతో ధరలు తగ్గిపోయాయి. నెల్లూరుకు కోళ్లు సరఫరా అయ్యే చిత్తూరు ఫారాల వద్ద కిలో కోడి అతి తక్కువగా 44 రూపాయలకు విక్రయిస్తున్నా దోపిడీకి అలవాటు పడిన కోళ్ల మాంసం విక్రేతలు ధరలు ఏమాత్రం తగ్గించడం లేదు.

కోడిగుడ్ల ధరల వ్యవహారం కూడా ఇదే రీతిన సాగుతుంది. కోడి గుడ్డు 2.40 రూపాయలకు అన్ని చోట్ల రిటైల్‌గా అమ్ముతుంటే నెల్లూరులో మాత్రం ముచ్చటగా మూడు రూపాయలకు అమ్ముతున్నారు. 25వ తేది మాత్రం డజను కోడిగుడ్లు 32 రూపాయలకు విక్రయించారు. మాంసం, కోడి గుడ్ల ధరల్లో రోజువారీ వచ్చే వ్యత్యాసం సామాన్యులకు తెలియడం లేదు. దీంతో ఈ ధరల దోపిడీ కొనసాగిపోతుంది.



ధర తగ్గనివ్వని కోడిమాంసం విక్రేతలు.

మొక్కజొన్న కంకి @ 12!

రెండు మూడేళ్ల క్రితం వరకు చినుకులు రాలే సీజన్‌లో వచ్చే మొక్కజొన్న కంకులు ఉడకబెట్టినవి, బొగ్గులపై కాల్చేవి రెండు, మూడు రూపాయల మధ్య దొరికేవి. ఏమయ్యిందో ఏమో ఈ యేడాది మిగతా తినుబండారాలు మాదిరే వీటి ధరలు కొండెక్కి కూర్చొన్నాయి. నెల్లూరు నగరంలో బండ్ల మీద గిన్నెలు పెట్టి ఉడికించే మొక్కజొన్న కండె ఇటీవల వరకు పది రూపాయలు అమ్ముతుండగా, గత వారం రోజులుగా పన్నెండు రూపాయలు చేసేశారు. అదేమంటే పచ్చిమొక్కజొన్న కంకులు వెయ్యి ఐదువేలరూపాయలుగా మార్కెట్‌లో అమ్ముతున్నారు. వీటిలో 500 కంకులే అమ్ముకోను ఉపయోగపడుతున్నాయని అందువల్లే ఈవిధంగా అమ్మాల్సి వస్తుందంటున్నారు. ఎసి కూరగాయల మార్కెట్‌లో రూరల్ మండలంలో పండించిన మొక్కజొన్న కండెలను బుట్టల్లో పెట్టి సరసమైన ధరలకు అమ్మేవారు లేకపోవడంతో ఇంటిల్లిపాది మొక్కజొన్న కంకులు తినాలను కొనేవారు ఐదారు కంకుల కోనుగోలుకు చిన్నబజారు వెళ్లకతప్పడం లేదు. నగరంలోని సినిమా హాళ్ల వద్ద ఉడకబెట్టిన మొక్కజొన్న కంకికి కారం, నిమ్మకాయ రసం పూసి 15 రూపాయలకు అమ్ముతున్నారంటే పరిస్థితులు ఏవిధంగా వున్నాయో అర్థం చేసుకోవచ్చు. మంచి పోషకాలుండే మొక్కజొన్న కంకిని కూడా సామాన్య, మధ్యతరగతీయులు కొని తినలేని పాడు రోజులు. దీనికి కారకులు ఎవరని నిందిద్దాం!



చూడాల్సిందే... కొని తినలేం.

గిరిజనాభివృద్ధి సంస్థలో గోల్‌మాల్!

నెల్లూరు, చిత్తూరు, కడప, ప్రకాశం జిల్లాలలోని గిరిజనులకు ఆర్థికంగా చేయూతనందించాలన్న సంకల్పంతో ఏర్పాటు చేసిన సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థను ఆ ప్రాజెక్ట్ అధికారి రమేష్ భ్రష్టు పట్టిస్తున్నాడు.



భ్రష్టుపట్టిపోయిన ఐటిడిఏ కార్యాలయం. (ఫైల్‌ఫోటో)

గిరిజన సాధికారత గురించి ప్రగల్భాలు పలికే ఐటిడిప ప్రాజెక్టు అధికారి కె.రమేష్ మొత్తం వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్నాడు. నెల్లూరు జిల్లాతోపాటు చిత్తూరు, కడప, ప్రకాశం జిల్లాల్లోని గిరిజనులకు ఆర్థికంగా చేయూతనందించాలన్న సంకల్పంతో సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థను రాష్ట్రప్రభుత్వం నెల్లూరు నగరంలో ఏర్పాటు చేయడం జరిగింది.

మరీ నిర్లక్ష్యం!

రమేష్‌కు ముందు అయిదుగురు ప్రాజెక్టు అధికారులుగా బాధ్యతలు నిర్వహించారు. కానీ రమేష్‌లా నిర్లక్ష్యంగా ఏ అధికారి కూడా విధులను నిర్వర్తించలేదనాలి. వ్యవసాయ శాస్త్రంలో పట్టభద్రుడైన రమేష్ తొలుత 'ఆత్మ' ప్రాజెక్టు డైరెక్టర్‌గా పని చేశారు. అక్కడ నుంచి బిసి కార్పొరేషన్ ఇడిగా కొద్ది నెలలు పని చేసి అనంతరం ఐటిడిఏ పి.ఓగా నియామకం తెప్పించుకోవడంలో అనేక ప్రయత్నాలు చేసి సఫలమయ్యాడు.

వ్యవసాయ శాస్త్రవేత్తగా రైతులకు అవసరమైన విత్తనాల ఉత్పత్తి ఇతర సలహాలు అందించాల్సిన ఇతనికి ప్రభుత్వం పరిపాలనాపరమైన కీలక బాధ్యతలు అప్పగించింది. దీంతో రమేష్ అభ్యసించిన విద్యకు సార్థకత చేకూరే అవకాశం లేకుండా పోయింది. ఐటిడిఏకు రాష్ట్రప్రభుత్వం కేటాయిస్తున్న కోట్ల రూపాయల నిధులు కొంతభాగం కార్యాలయ ఖర్చులకే సరిపోతున్నాయి. మిగిలిన నిధులతో గొర్రెలు, గేదెలు, మేకలు కొనుగోలు చేసి లబ్దిదారులకు అందజేస్తున్నారు.

సిబ్బందిలో గందగగోళం!

పిఓగా బాధ్యతలు చేపట్టిన మరుసటి రోజు నుంచి సిబ్బంది మొత్తాన్ని వివిధరకాలుగా భయభ్రాంతులకు గురి చేశారు. పత్రికల వారితో ఎవరు మాట్లాడినా తన గురించి సమాచారం అందిస్తారన్న అనుమానం పెంచుకొంటాడు. ఇదే కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంటు పిఓ అధికార బలానికి బలయ్యాడు. జూనియర్ అసిస్టెంటు ఎటువంటి సమాచారం చేరవేయకపోయినా అతనిపై అనుమానం పెంచుకొని ఏదో ఒక కారణం చూపి వేతనంలో కోత పెట్టాడు. చివరకు జూనియర్ అసిస్టెంట్ రాష్ట్ర ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడంతో పూర్తి వేతనం ఇస్తున్నాడు.

ఘనకార్యాలెన్నో!

గతంలో రమేష్ ఉదయగిరి మండలానికి ప్రత్యేక అధికారిగా నియమితులైనాడు. ఆ సమయంలో మండల పరిషత్ కార్యాలయంలో పనిచేసే మహిళా ఉద్యోగి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడన్న ఆరోపణలు ఎదుర్కొన్నాడు. ఈ సంఘటన స్థానిక ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి దృష్టికి వెళ్లడంతో ఆయన తీవ్ర పదజాలంతో పిఓకు హెచ్చరికలు చేసిన విషయం తెలిసిందే. ఇదిలా వుండగా ఇదే మండలానికి చెందిన జట్పీటిసీ సభ్యురాలు రమణమ్మ పట్ల కూడా పిఓ అనుచితంగా ప్రవర్తించాడు. ప్రజాప్రతినిధి అనికూడా చూడకుండా ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానించేవాడు కాదు.

పిఓ చర్యలను నిరసిస్తూ జిల్లా కలెక్టర్, జడ్పీ ఛైర్మన్లకు రాత పూర్వకంగా ఫిర్యాదు కూడా చేయడం జరిగింది. అధికార్లు స్పందించక పోవడంతో జడ్పీ సమావేశం సందర్భంగా పిఓ రమేష్‌పై చర్యలు తీసుకోవాలని పట్టుపట్టింది. దీంతో వేరే మండలానికి ప్రత్యేక అధికారిగా నియమిస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించడంతో ఆమె శాంతించారు. గిరిజనులకు జరుగుతున్న అన్యాయం, దాడులు, వేధింపులపై సక్రమంగా స్పందించలేదని ఎవరైనా ఫిర్యాదుచేసినా, ధర్నాలు చేసినా అటువంటి వారిని బెదిరించడం ఆనవాయితీ.

ముడుపులివ్వకుంటే తనిఖీ!

గిరిజన సంఘంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని ఇదే రీతిలో భయపెట్టి గిరిజనుల చేతనే కావలిలో పోలీసు కేసు పెట్టించినట్లు ఆరోపణలు వున్నాయి. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాస్టళ్ల వార్డెన్ల నుంచి కూడా భారీగానే ముడుపులు అందుతున్నాయి. ఎవరైనా ముడుపులు ఇవ్వకుంటే వారి హాస్టల్ తనిఖీకి వెళ్లి వసతులు బాగా లేవని ప్రకటనలు చేసి సస్పెండ్ చేయడం పిఓకు వెన్నతో పెట్టిన విద్యగా భావించవచ్చు.

గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారి వున్నాడు. అయినా కూడా మొత్తం ఫైళ్లు ఈయన ఆధీనంలో వుండడం గమనార్హం. హాస్టళ్లలో పనిచేసే నాల్గవతరగతి వుద్యోగులు మామూళ్లు సమర్పించుకుంటే వారిని కార్యాలయ అటెండర్లగా డిప్యూటేషన్‌పై నియమించేస్తుంటాడు. హాస్టళ్లలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడం మాని ముడుపులు స్వీకరించి ఎటువంటి అభియోగాలు లేకుండా చేస్తుంటాడు.

గిరిజన సంక్షేమశాఖ విభాగంలో విధులు నిర్వహించే ఒక సీనియర్ అసిస్టెంటు పిఓకు మామూళ్లు వసూలు చేసే బాధ్యతను చూస్తున్నాడు. శాఖలో పని చేస్తున్న వుద్యోగులు గాని, బయట ప్రాంతాల నుంచి వివిధ పనులపై వచ్చేవారు గాని ఈ గుమస్తాను కలిసి అడిగినంత నగదు సమర్పించుకుంటే పనులు జరిగిపోతుంటాయి. జిల్లా కలెక్టర్ నుంచి రాష్ట్ర సచివాలయం వరకు ఉన్నతాధికారులకు పిఓపై అనేక ఫిర్యాదులు వెళ్లాయి.

ఎమ్మెల్యేల వద్ద అతి వినయం!

మంత్రులు, ఎమ్మెల్యేలతో చాలా సన్నిహితంగా మెలగడం వలన ప్రభుత్వానికి వెళ్లిన ఫిర్యాదులన్నీ బుట్టదాఖలైనట్లు తెలుస్తుంది. ఎవరైనా విచారణకు వస్తే వారిని ప్రైవేటు అతిథి గృహాలలో



ఐటిడిఏ పిఓ రమేష్

వుంచి అవసరమైన సకల సౌకర్యాలు ఏర్పాటుచేసి తనకు అనుకూలంగా వ్యవహరించేటట్లు చేసుకుంటాడు. గిరిజనుల నిధులతో సకల భోగాలు అనుభవిస్తున్న పిఓ రమేష్‌ను జిల్లా కలెక్టర్ వెనకేసుకు రావడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

చందాదారులకు మనవి

- చందా పంపించేటప్పుడు తమ చందా నెంబరు, పూర్తి పేరు, చిరునామా తెలియ పరచండి.
- 'జమీన్‌రైతు' చందాదార్లు తమ చందాను ఎం.ఓ/డి.డి రూపంలో మాత్రమే పంపగలరు. చెక్కులు స్వీకరించబడవు.
- మీ చందా నెంబరు, చందా ఏ తేదికి అయిపోతుందో, అడ్రసు రేపరు మీదనే ముద్రించి వుంటుంది. సకాలంలో చందా చెల్లించవలసినదిగా కోరుతున్నాము.

జీవిత చందా రూ.1000/-

సంవత్సర చందా

స్వదేశంలో రూ.200/-

విదేశాలకు రూ.1000/-

జమీన్‌రైతు

పాగతోట, నెల్లూరు - 524 001

ఫోన్: 0861 - 2327354

సెల్: 98489 66190



వైఎస్ జగన్ చేపట్టిన ఓదార్పు యాత్రకు చీకాకులు తొలగిపోవాలని నెల్లూరు టౌన్‌హాల్ వద్ద గల వినాయకుని గుడిలో టెంకాయలు కొడుతున్న పిసిసి కార్యదర్శి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బృందం.



సూరాయపాళెం వద్ద గల బొల్లినేని పవర్ ప్లాంట్ వెదజల్లిన బూడిద వల్ల కళ్లు దెబ్బతిన్న బాధితులను నెల్లూరు మాదరన్ కంటి ఆస్పత్రిలో పరామర్శిస్తున్న తెలుగుదేశం జిల్లా నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి.



జడ్పీ ఛైర్మన్‌గా నాలుగేళ్ల పరిపాలన పూర్తయిన సందర్భంగా కాకాణి గోవర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆయన అభిమానులు.



మధురగాయకుడు మహమ్మద్ రఫీ వర్ధంతిని పురస్కరించుకొని నిర్వహించే యాదేరఫీ కార్యక్రమం బ్రోచర్‌ను విడుదల చేస్తున్న సిటీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి. ప్రక్కన కార్యక్రమ నిర్వాహకులు జకీర్, ఖాజావలి, నన్నేసాహెబ్ తదితరులు.

పద్మవ్యూహంలా ఆత్మకూరు ట్రాఫిక్!

దురాక్రమణల వల్లే ఈ దుస్థితి

ఆత్మకూరు పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య అధికమవుతోంది. దీనికి ప్రధాన కారణం మెయిన్ బజార్‌రోడ్డు ఆక్రమణలకు గురికావడం. రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారులు, పెద్దపెద్ద అంగళ్లవారు పోటీలుపడి రోడ్డును ఆక్రమించేస్తుండడంతో ఈ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. నడిచివెళ్లే వారికి సైతం అడ్డంకిగా మారింది. అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొనింది. నిత్యం ట్రాఫిక్ చిక్కుముడులు తలెత్తుండడంతో ఉదయగిరి, రాయలసీమ ప్రాంతాలకు చెందిన వివిధ ఆర్టీసి బస్సులు ఆత్మకూరు పట్టణంలోకి రాకుండానే బైపాస్‌రైడర్లుగా నెల్లూరుకు రాకపోకలు సాగిస్తున్నాయి. నెల్లూరుపాళెం కూడలి నుంచి పట్టణంలోని పంచాయితీ బస్టాండు వరకు రావాలంటే అరగంట సమయం పడుతున్నదంటే ఎంతగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇంతగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నా, రోడ్లు ఆక్రమణల చెరలో చిక్కుకొన్నా పంచాయితీ పాలకవర్గం దృష్టి సారించకపోవడంతో ప్రజలు నిత్యం ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకొని అల్లాడుతున్నారు.

గోడౌన్లుగా మారిన పాఠశాలలు

● వెంకటాచలంలో పరిస్థితిది.

జిల్లాలో పలు చోట్ల పాఠశాలలకు తగిన సౌకర్యాలు లేక, విద్యార్థులకు సరిపడే తరగతి గదులు లేక, మరికొన్ని చోట్ల శిథిలమై కూర్చొనే సదుపాయం లేక పిల్లలు చెట్లక్రింద చదువుకోవడం చూస్తుంటాం. దీనికి భిన్నంగా వుంది వెంకటాచలం మండలంలో పాఠశాలల స్థితి. మండలంలోని పలు గ్రామాల్లోని పాఠశాలల్లోని గదులను స్థానికులు కొందరు ఆక్రమించుకొని ధాన్యాన్ని, ఎరువులను నిల్వచేసుకొంటూ సరస్వతి నిలయాలను కాస్తా గోడౌన్లుగా మార్చేశారు. కందలపాడు గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో 50 పుట్లకుపైగా ధాన్యాన్ని నిల్వచేసిన ఒక రైతు ఏకంగా తరగతి గదులకు తాళాలు వేసి తన వద్ద వుంచుకోవడం చూస్తుంటే ఎంతగా పాఠశాలలను తమ సొంతానికి వినియోగించుకొంటున్నారో అర్థమవుతుంది. హరిజనవాడలో గల పాఠశాలలోనూ ఇదే తంతు. మండలంలోని కనుపూరు కమ్యూనిటీహాలు భవనంలోనూ కొందరు రైతులు ధాన్యాన్ని నిల్వ చేసుకొని వున్నారు. ఇక్కడ నిరంతర విద్యా కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నప్పటికీ గ్రామస్తులు ధాన్యాన్ని నిల్వ చేసుకొంటుండడంతో పిల్లలు ఆరు బయటే చదువుకోవాల్సి వస్తోంది. దీనిపై ఉన్నతాధికార్లకు ఫిర్యాదులు అందినా స్పందించడం లేదు. మరోవైపు పాఠశాలల్లో ధాన్యం నిల్వలపై ప్రశ్నించిన ఉపాధ్యాయులపై స్థానికులు దౌర్జన్యం చేయడం, నేతలు వారిని సమర్థిస్తుండడంతో పాపం అయ్యోర్లు ఏమీ చేయలేక చెట్ల క్రిందే పాఠాలు చెప్పుకోవాల్సిన దుర్గతి ఏర్పడింది.

● పాపం...

పిడతాపోలూరు సర్పంచ్!

చిన్న పదవిని అడ్డం పెట్టుకొని కోట్లకు పడగలెత్తుతున్న కాలంలో సర్పంచ్‌గా వుండే వ్యక్తికి సొంతిల్లులేక తుఫాను షెల్టర్‌లో తలదాచుకొంటున్న వైనం ముత్తుకూరు మండలంలో చోటు చేసుకొంది. మండల పరిధిలోగల పిడతాపోలూరు గ్రామ సర్పంచ్‌గా వున్న ఆర్మగం హైమావతికి సొంతిల్లు లేదు. పేదల కోసం ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెడుతోంది. గూడు కల్పించేందుకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతున్న పరిస్థితులలో దానికి నోచుకోక పంచాయితీ పరిధిలోని పల్లెపాడుదిబ్బలో గల తుఫాను షెల్టర్‌లో నాలుగేళ్లుగా తలదాచుకొంటోంది సర్పంచ్ కుటుంబం. భర్త అనారోగ్యంపాలై కూలిపనులకు వెళ్లలేకపోవడంతో సర్పంచ్ హైమావతి కూలి పనికి వెళ్తూ వచ్చే డబ్బుతో కుటుంబాన్ని పోషించుకొంటుంది. చాలీచాలని సంపాదనతోనే ఇద్దరు ఆడపిల్లలను చదివిస్తూ, మరోవైపు భర్తకు వైద్యం చేయిస్తూ బ్రతుకు బండిని నడిపిస్తున్నది హైమావతి. చోటా నేతలు అధికారం చెలాయిస్తూ అయినవాళ్లకు, కాని వాళ్లకు ఎడాపెడా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తున్న తరుణంలో సర్పంచ్‌గా వున్న మహిళకు ఇందిరమ్మ పథకం క్రింద సొంత ఇంటిని ఏర్పాటు చేయాలన్న ఆలోచన అటు మండలస్థాయి నేతలకు, ఇటు అధికారులకు లేకపోవడం విచారకరం.

పార్వతమ్మను పిలవని విష్ణు!

వైఎస్ విగ్రహ శంకుస్థాపనలో విభేదాలు బట్టబయలు



కావలిలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహ ఏర్పాట్లు కాంగ్రెస్ పార్టీలోని వర్గవిభేదాలను మరోసారి బట్టబయలు చేశాయి. తన సొంత నిధులతో వైఎస్ విగ్రహాన్ని తయారుచేయించిన మాగుంట పార్వతమ్మను విగ్రహ శంకుస్థాపన కార్యక్రమానికి పిలవకపోవడం పట్ల కావలి కాంగ్రెస్‌లో తీవ్ర చర్చకు దారి తీసింది. జాతీయ రహదారిపై వైఎస్ విగ్రహ శంకుస్థాపన కార్యక్రమానికి పార్వతమ్మకు ఆహ్వానం పంపకుండా ఎంపి చేతుల మీదుగా జరిపించారు. దీనిపై పలువురు మాగుంట అభిమానులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. కావలి మాజీ ఎమ్మెల్యేగానే కాకుండా పార్వతమ్మ సొంతంగా విగ్రహాన్ని తయారు చేయించి వ్యవసాయ మార్కెట్‌లో భద్రపరచారు. అలాంటి దాతకు చివరకు పిలుపేలేకపోవడం బాధాకరం అని, కావాలని పనిగట్టుకొని విష్ణువర్గం ఈ పని చేస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు.



చెత్తాచెదారంతో నిండిన గ్రామాలు!

వెంకటగిరి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం క్షీణిస్తోంది. రోడ్లపై ఎక్కడ చూసినా చెత్తకుప్పలు, మురుగునీరు దర్శనమిస్తుంది. ప్లాస్టిక్ వ్యర్థాలు మరింతగా పారిశుధ్యం అస్తవ్యస్తం అయ్యేందుకు కారణం అవుతున్నాయి. వీటికితోడు ట్రాఫిక్ సమస్య ప్రజలను పట్టిపీడిస్తోంది. వెంకటగిరి పట్టణంతోపాటు నియోజకవర్గ పరిధిలోని పలు మండల కేంద్రాలు, గ్రామాల పరిస్థితి ఇదే విధంగా వుంది. డక్కిలి, బాలాయపల్లి, రాపూరు మండలాల్లో కాలుష్యం అధికంగా వుంది. ట్రాఫిక్ సమస్య ఎక్కువగా వుంది. ఆటోలు అధికంగా ఈ ప్రాంతంలో తిరుగుతుండడం వలన దేవుడువెలం పల్లి, కమ్మపల్లి, బస్టాండు సెంటర్లలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఎదురౌతుంది. పలు గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు కాలువల్లో పారేస్తుండడం వల్ల కాలువలు పూడిపోయి మురుగునీరు రోడ్లపైకి పొంగిపొర్లుతోంది. చికెన్, మటన్‌స్టాల్ నిర్వాహకులు, హోటళ్లు,

వెంకటగిరి నియోజకవర్గంలో పరిస్థితిది

వ్యాపార సంస్థల నిర్వాహకులు వ్యర్థాలు, చెత్తను రోడ్లపైనే వేస్తుండడంతో సమస్య మరింత జటిలం అవుతోంది. ఇంతగా పారిశుధ్యం క్షీణిస్తున్నా సంబంధిత పంచాయితీ పాలకవర్గాలు దృష్టిసారించకపోవడంతో పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది.



నెల్లూరు కార్పొరేషన్ నగరంలో చెత్త తొలగింపుకు కొత్తగా కొన్న వాహనాల ప్రారంభోత్సవంలో మేయర్ భానుశ్రీ వాహనాన్ని నడుపుతుండగా జెండా వూపుతున్న రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి.

• గూడూరు ఆస్పత్రిలో
శవాల కంపు!

చీమకుట్టినట్లుగా లేని వైద్యాధికారులు

గూడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో అపరిశుభ్రత తాండవిస్తోంది. ఎక్కడ చూసినా ఆస్పత్రి వ్యర్థాలు, అపరిశుభ్రంగా వున్న గదులే కన్పిస్తుంటాయి. చివరకు మార్చురీలో వున్న అనాధశవాలను రోజుల తరబడి తరలించనందు వల్ల కుళ్లి కంపుకొడుతుండడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు భరించలేక పోతున్నారు. మార్చురీ ప్రక్కనే కంటి చికిత్సా విభాగం వుండడంతో ఎక్కడ అంటువ్యాధులు ప్రబలుతాయోనని ఆస్పత్రికి వచ్చే రోగులు హడలిపోతున్నారు. ఇంతగా శవాలు కుళ్లి కంపుకొడుతున్నా ఆస్పత్రి వైద్యాధికారులకు చీమకుట్టినట్లు లేకపోవడం పట్ల ఆస్పత్రికి వచ్చేవారు తీవ్రంగా స్పందిస్తున్నారు. రోగులంటే వైద్యులకు లెక్కలేకుండా పోయిందని చికిత్స కూడా సక్రమంగా జరగడం లేదని వారు వాపోతున్నారు.

బెల్టుషాపులు తొలగించండి!

గూడూరులో బెల్టుషాపులు తొలగించాలని మద్య నియంత్రణ కమిటీ డిమాండ్ చేసింది. కమిటీ సభ్యులు ఎక్సైజ్ అధికారులను కలిసి బెల్టుషాపుల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు, ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. గూడూరు సర్కిల్ పరిధిలో నూతనంగా టెండర్లు పొందిన మద్యం షాపులు నిర్వహిస్తున్న వారు గ్రామ గ్రామాన విచ్చలవిడిగా బెల్టుషాపులు ఏర్పాటు చేసుకొన్నారని, రోజురోజుకూ

గూడూరులో మద్య నియంత్ర కమిటీ డిమాండ్

ఈ సంఖ్య పెరిగిపోతున్నదని వివరించారు. బెల్టుషాపులు విచ్చలవిడిగా వెలుస్తుండడంతో త్రాగుబోతులు మహిళలను వేధిస్తున్నారని, శాంతిభద్రతల సమస్య తలెత్తుతున్నాదని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొని వచ్చారు. అలాగే మద్యం వ్యాపారులు ఇష్టానుసారంగా ధరలు పెంచి అమ్ముతున్నారని వీటినీ నియంత్రించాలని కోరారు.

అయోడిన్ లోపంతో అంగవైకల్యం!

అయోడిన్ లోపం కారణంగా పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని బుచ్చిరెడ్డిపాళెం వైద్యాధికారిణి డాక్టర్ వాసవి తెలియజేశారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగిన జాతీయ ఆరోగ్య కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ అయోడిన్ లోపం కారణంగా బుద్ధిమాంద్యం ఏర్పడే ప్రమాదం వుందన్నారు. ప్రతి మనిషి రోజుకు 150 మైక్రోగ్రాముల అయోడిన్ ఉప్పును తీసుకోవాలని సూచించారు. గర్భిణులకు ఈ లోపం వున్నట్లయితే పుట్టే పిల్లలలో అంగవైకల్యం, వినికిడి సమస్య, మెల్లకన్ను తదితర లోపాలు ఏర్పడుతాయన్నారు. శారీరక ఎదుగుదల, మానసిక ఎదుగుదల లోపించే ప్రమాదం వుందని హెచ్చరించారు. దేశంలో అయోడిన్ లోపం కారణంగా పలు శారీరక సమస్యలు, లోపాలతో బాధపడుతున్న వారి సంఖ్య అధికంగా వుందన్నారు. దీనిని దృష్టిలో వుంచుకొని ప్రతి ఒక్కరూ అయోడిన్‌ను వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రమ్యకృష్ణ, పెంచలయ్య, నారాయణరెడ్డి, సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సముద్రతీరం పరిశీలన

చెన్నైకు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజి బృందం వాకాడు మండలంలో పర్యటించింది. మండల సరిహద్దులోని రాయిదొరువు, కొండూరుపాడులో వున్న బంగాళాఖాతం సముద్ర ముఖద్వారాన్ని వారు పరిశీలించారు. గత కొన్నేళ్లుగా ఈ రెండు ముఖద్వారాల వద్ద ఇసుకమేట వేసుకొని వుండడంతో మత్స్యకారుల చేపల వేటకు ఇబ్బందికరంగా పరిణమించింది. సముద్రంలోని బ్యాక్ వాటర్ ఇసుకమేట కారణంగా పులికాట్ సరస్సు, బకింగ్‌హామ్ కెనాల్‌కు నీరు రావడం కష్టతరంగా మారింది.

వాకాడులో ఎన్ఐఓటి బృందం

దీనిపై స్పందించిన ఎమ్పీ చింతామోహన్, ఎఆర్‌డి స్వచ్ఛంద సంస్థ సభ్యులు పై సంస్థ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఎన్ఐఓటి బృందం ప్రొఫెసర్ రాజగోపాల్ ఆధ్వర్యంలో ఇక్కడి పరిస్థితులను అధ్యయనం చేసేందుకు వచ్చింది. వీరితోపాటు వన్యప్రాణి విభాగం డిఎఫ్ఓ పార్థానందప్రసాద్ వున్నారు. పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించిన బృందం పూడికతీతకు పరిస్థితులు అనుకూలంగానే వున్నట్లు గుర్తించి అందుకోసం 14కోట్ల రూపాయలు ఖర్చువుతాయని అంచనాకు వచ్చారు.

• వెంకటగిరి
రోడ్లకుమోక్షం

నియోజకవర్గంలో పలు రోడ్లకు నిధులు మంజూరు

చాలా కాలంగా మరమ్మత్తులకు నోచుకోని వెంకటగిరి నియోజకవర్గంలోని రోడ్లకు ఎట్టకేలకు మోక్షం లభించింది. బాలాయపల్లి మండలంలో పలు రోడ్ల మరమ్మత్తులకు రూ.1.93కోట్లు మంజూరయ్యాయి. బంగారుపేట నుండి నిడిగల్లు, పిగిలాం మీదుగా హస్తకావేరి వరకు కోటి రూపాయల వ్యయంతో రోడ్డు పనులు చేపట్టారు. వెంకటగిరి – నాయుడుపేట మార్గంలో మేల్చూరు – జయంపు మధ్య 80లక్షలతో పనులు ప్రారంభం అయ్యాయి. జయంపు నుంచి సుబ్రమణ్యం మీదుగా బాలాయపల్లి వరకు 8.76 లక్షలతో పనులు జరుగుతున్నాయి. అలాగే గొల్లపల్లి – జయంపు మార్గంలో అలిమిలి నుంచి మన్నూరు వరకు 4లక్షలతో మరమ్మత్తు పనులు చేపట్టారు. మొత్తం మీద ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చొరవతో నియోజకవర్గంలోని గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టింది. ఇప్పటివరకు గుంటల మిట్టలుగా వున్నరోడ్లపై ప్రయాణించిన వారికి ఇకపై ప్రయాణం సాఫీగా సాగనుంది. రోడ్ల మరమ్మత్తులతో పాటు వెంకటగిరి – నాయుడుపేట ప్రాంతంలో తూముల విస్తరణ పనులు చేపట్టారు.


కైవల్యకు గర్భశోకం

కైవల్యానది నుంచి ఇసుక తరలింపు యదేచ్ఛగా జరుగుతోంది. వెంకటగిరి వెలుగొండల నుంచి ప్రవహించే కైవల్యానదిలోని ఇసుకను భవన నిర్మాణాలు, ఇతరత్రా అవసరాలకుగానూ త్రవ్వి తీసుకు పోతుండడంతో భూగర్భజలాలు తగ్గిపోతున్నాయి. పెద్ద ఎత్తున ఇసుకను తరలించడం వలన పరీవాహక ప్రాంతంలోని నిమ్మతోటల సాగుకు ఇబ్బంది కల్గుతోంది. వెంకటగిరి, కదగుంటవంతెన, వెంగమనాయుడుపల్లి, గొల్లపల్లి, నిండలి ప్రాంతాల నుంచి ఇసుకను త్రవ్వి తరలించుకపోతున్నారు. ప్రొక్లెయిన్లను వినియోగించి ఇసుకను త్రవ్వుతుండడంతో దానిని తరలించేందుకు వచ్చే వాహనాలు వంతెనకు ఇరువైపులా బారులు తీరి కన్పిస్తున్నా సంబంధిత అధికారులకు మాత్రం ఈ అక్రమ రవాణా కన్పించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

కలుషితనీరు తాగుతున్న బోగోలు జనం


బోగోలు పంచాయితీ నుంచి సరఫరా అయ్యే త్రాగునీరు కలుషితం అవుతుండడంతో ఆ నీటిని వినియోగిస్తున్న ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. గ్రామస్తుల దాహార్తిని తీర్చేందుకు ట్యాంకును నిర్మించారు. చాలా కాలం నుంచి ట్యాంకును శుభ్రపరచకపోవడంతో పాచిపట్టిన నీరే సరఫరా అవుతుండడంతో గ్రామస్తులు ఆ నీటిని త్రాగలేక, వేరే గత్యంతరం లేక అవస్థలు పడుతున్నారు. ట్యాంకును శుభ్రం చేయని కారణంగా నీటిలో పురుగులు వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. దీనికితోడు కోతులు ట్యాంకుపై ఎక్కి అక్కడే మల మూత్రాలను విసర్జిస్తుండడంతో త్రాగునీరు కలుషితం అవుతోంది. పేదలు ఆ నీటినే త్రాగాల్సి వస్తుండడంతో రోగాల బారినపడి ఆస్పత్రి పాలవుతున్నారు. ఇంతగా కలుషిత నీరు ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నా పంచాయితీ పాలకవర్గం పట్టించుకోకపోవడంతో ప్రజలు త్రాగునీటికి అవస్థలు పడాల్సి వస్తోంది.

ఆగష్టు సంక్షోభం తప్పదా!




ఈసారి కూడా ఆగష్టు సంక్షోభం తప్పదా? తప్పక పోవచ్చనే అంటున్నారు రాజకీయ పండితులు. రాష్ట్రంలో ఎప్పుడు రాజకీయ సంక్షోభం వచ్చినా అది ఆగష్టు నెలలోనే రావడం ఆనవాయితీగా మారింది. ఈసారి సంక్షోభం 'జగన్' ద్వారా వచ్చే అవకాశముందంటూ రాజకీయులు జోస్యం చెబుతున్నారు. ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లాలో ఓదార్పు యాత్రలో వున్న జగన్ ఈ నెలాఖరుకు హైదరాబాదుకు తిరిగి వస్తున్నాడు. ఓదార్పులో జన స్పందనతో జగన్ ఓ నిర్ణయానికి వచ్చాడట. ఇప్పటికే వై.ఎస్ సానుభూతిపరుల్ని ఏరివేసే కార్యక్రమం మొదలైంది. అంబటి రాంబాబు వంటి వీరవిధేయుడిపై సస్పెన్షన్ వేటు పడింది. త్వరలో మంత్రివర్గ విస్తరణ జరిగితే వై.ఎస్ వర్గీయులకు ఉద్వాసన తప్పకపోవచ్చు. ముఖ్యంగా పార్టీ ఆదేశాల్ని పక్కనబెట్టి జగన్ యాత్రలో పాల్గొన్న మంత్రి పిల్లి సుభాష్‌చంద్రబోస్‌పై వేటుపడే ప్రమాదం వుంది. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని జగన్ 'ఆగష్టు'లో రాజకీయ సంక్షోభానికి తెరతీస్తాడన్నది ఆయన వర్గీయుల ఉవాచ.

మళ్లీ తెరపైకి 'జగడ'పాటి




ఎప్పుడు ఎన్నికలు వచ్చినా విజయవాడ ఎమ్పీ లగడపాటి తన సర్వేలతో జగడపాటిగా మారిపోతాడు. తెలంగాణ ఉప ఎన్నికల్లో పోలింగ్ ముగిశాక కాంగ్రెస్‌కు సున్నా అంటూ లగడపాటి ప్రకటించాడు. ఓ ప్రయివేటు సంస్థ ద్వారా జరిపిన సర్వే వివరాలంటూ లగడపాటి అందించిన లెక్కల్లో కాంగ్రెస్‌కు ఒక్క స్థానం కూడా లభించలేదు. చివరకు పిసిసి చీఫ్ కూడా నిజామాబాద్ అర్బన్‌లో మట్టి కరుస్తాడని లగడపాటి వెల్లడించారు. దీంతో మళ్లీ కాంగ్రెస్‌లో 'జగడం' మొదలైంది. సర్వే చేయించడానికి 'లగడపాటి' ఎవరు? అంటూ డిఎస్ వర్గీయులు కారాలు మిరియాలు నూరుతున్నారు. లగడపాటి వైఖరిపై ఇప్పటికే పిసిసికి, ఢిల్లీ అధిష్టానానికి ఫిర్యాదులు పంపే పనిలో పడ్డారు. కొందరైతే పత్రికల్లో లగడపాటిపై నిప్పులు కక్కారు. టి.వి.ఛానెళ్లకు మరో వివాదం దొరికింది. దీనిపై చర్చాకార్యక్రమాలు మొదలయ్యాయి. మొత్తానికి మరో జగడానికి తెరలేవడంతో గాంధీభవన్ వేడెక్కింది. దటీజ్ కాంగ్రెస్!!

సిఎం పేషీలో అగర్వాల్‌కు పనిలేదు



ఈమధ్యనే స్పెషల్ చీఫ్ సెక్రటరీ హోదాలో సిఎం పేషీలో సలహాదారుగా చేరిన మాజీ ఐఎఎస్ పి.కె. అగర్వాల్‌కు పనేంలేదట. ఏం చేయాలో తెలీక ఆయన ఛాంబర్‌కే పరిమితమవుతున్నాడు. నీటిపారుదల శాఖలో ఓఎస్‌డిగా వున్న అగర్వాల్‌కు అక్కడ ఏపనీ లేకపోవడంతో సిఎం పేషీకి మార్చారు. ఇక్కడకు వచ్చాక కూడా అగర్వాల్ పరిస్థితిలో ఏం మార్పు లేకుండాపోయింది. సంక్షేమ కార్యక్రమాల అమలుపై సిఎంకు సలహాల్ని ఇవ్వడం ఆయన పని. అయితే సంక్షేమశాఖలకు సీనియర్ ఐఎఎస్ అధికారులు ముఖ్యకార్యదర్శులుగా వుండటంతో అగర్వాల్‌కు సలహాలు ఇవ్వాల్సిన అవసరం లేకుండా పోతోంది. గతంలో వై.ఎస్ సిఎంగా వున్నప్పుడు వైద్యఆరోగ్య ముఖ్య కార్యదర్శిగా పని చేశాడు అగర్వాల్. అప్పట్లో 108 సర్వీస్ ప్రతిపాదనను వ్యతిరేకించి వై.ఎస్ ఆగ్రహానికి కారణమయ్యాడు. ఆ తర్వాత 'సర్దుకొని' వై.ఎస్ మన్ననలు పొందాడు. రోశయ్య సామాజిక వర్గానికి చెందినవాడు కావడంతో రిటైర్ అయినా అగర్వాల్‌కు రాజయోగం తప్ప లేదు. ప్రస్తుతం ఏ పని లేకపోవడమే ఆయన సమస్య.



జగన్ వర్గం ఎదురుదాడి

తెలంగాణ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిని ఆయుధంగా చేసుకొని ఎదురుదాడికి దిగాలని జగన్ వర్గం నిర్ణయించింది. తెలంగాణలో ఓదార్పు యాత్రను అడ్డుకున్నందువల్లనే కాంగ్రెస్‌కు ఓట్లు పడలేదంటూ జగన్ వర్గీయులు కత్తులు నూరుతున్నారు. తెలంగాణలో వున్న వై.ఎస్ అభిమానులంతా పార్టీ వైఖరిపై ఆగ్రహంగా వున్నారని, ఉపఎన్నికల్లో దీని ప్రభావం పడిందంటూ ఇప్పటికే బాన్సువాడ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ లాంటి వాళ్లు విమర్శలకు దిగారు. తెలంగాణలో జగన్ ఓదార్పు యాత్ర జరిగివుంటే 12 స్థానాల్ని కూడా గెలిచే వాళ్లమంటూ జగన్ వర్గీయులు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. మొత్తానికి జగన్ వర్గీయులకు తెలంగాణలో కూడా "పట్టు" సాధించడానికి ఉపఎన్నికలు ఉపయోగపడుతున్నాయని గాంధీభవన్ వర్గాలు చెవులు కొరుక్కొంటున్నాయి.

జడ్పీ ఛైర్మన్ కప్ పోటీలు జయప్రదం!

జిల్లాపరిషత్ ఛైర్మన్ కప్ –2010 పోటీలు నగరంలోని ఎసి సుబ్బారెడ్డి స్టేడియంలో విజయవంతంగా ముగిశాయి. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జిల్లా పరిషత్ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి గత మూడేళ్లుగా క్రమం తప్పకుండా సొంత నిధులతో రాష్ట్రంలో మరో ఛైర్మన్ చేపట్టని విధంగా ఈ పోటీలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగానే ఈ ఏడాది ఛైర్మన్ కప్ పోటీలు మూడురోజులపాటు ఎసి స్టేడియంలో అట్టహాసంగా జరిగాయి. ముందుగా అనుకున్న విధంగా జూలై 21తేది ప్రారంభమై 23తేది వరకు జరగాల్సి వుండగా వర్షం కారణంగా ఒక్కరోజు ఆలస్యంగా ప్రారంభమైనాయి. జిల్లావ్యాప్తంగా మొత్తం 46 మండలాల నుంచి 1900 మంది గ్రామీణ క్రీడాకారులు పాల్గొన్నారు. ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్‌ల్లో జరిగిన పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బహుమతి ప్రదానానికి ముందురోజు జరిగిన క్యాంప్‌ఫైర్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి జాతీయనేత ఎం.వెంకయ్యనాయుడు విచ్చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులు చేసిన నృత్యాలు, శ్రీకృష్ణదేవరాయల భువన విజయాన్ని క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పోషించి మెప్పించారు. ముగింపు కార్యక్రమంలో విజేతలకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలను అందజేశారు. వాలీబాల్, అథ్లెటిక్స్‌లో నెల్లూరు జట్టు, కబడ్డీలో ఇందుకూరుపేట జట్టు, ఖోఖోలో రూరల్ జట్టు విజేతలుగా నిలిచాయి. ఒక దశలో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా క్రీడాకారులు రెట్టింపు ఉత్సాహంతో పాల్గొనడంతో ఛైర్మన్ కప్ క్రీడలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో తుడా ఛైర్మన్ పెంచలరెడ్డి, జడ్పీ సిఇఓ రామిరెడ్డి, వైస్ ఛైర్మన్ రాజా, అధికారులు, జడ్పీటిసి సభ్యులు పాల్గొన్నారు.



జడ్పీఛైర్మన్ కప్ విజేతలకు బహుమతినందిస్తున్న వెంకయ్యనాయుడు, జిల్లా కలెక్టర్ రాంగోపాల్, కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నూతన ఒరవడి!



రాష్ట్రంలో ఏ జిల్లాపరిషత్ ఛైర్మన్ చేపట్టని విధంగా సొంతనిధులు వెచ్చించి విద్యార్థులను ప్రోత్సహించటమే కాకుండా గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్న జడ్పీఛైర్మన్ గోవర్ధన్‌రెడ్డి పలువురికి ఆదర్శం.

వితపు బాలసుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ

క్రీడలను పాఠ్యాంశంగా చేయాలి!



మానసిక స్థైర్యాన్ని, శారీరక ధారుడ్యాన్ని పెంపొందించేవి క్రీడలు. అలాంటి క్రీడలను పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలి. దేశానికి పట్టుగొమ్మలు గ్రామాలు. అలాంటి గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను వెలికితీసి ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో సొంత నిధులు వెచ్చించి క్రీడా పోటీలు నిర్వహిస్తున్న జడ్పీఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి అభినందనీయుడు.

ఎం.వెంకయ్యనాయుడు, ఎమ్పీ

ప్రతిభను వెలికితీసేందుకే!



గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు నాలుగేళ్లుగా ఛైర్మన్ కప్ పోటీలు నిర్వహిస్తున్నాను. జిల్లావ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించేందుకు 7 మినీ స్టేడియంలను ఏర్పాటు చేస్తున్నాం. నేను పదవిలో లేకపోయినా ఈ పోటీలకు ఆటంకం కలగకుండా వుండేందుకు ఇసుక ద్వారా వస్తున్న కోట్ల రూపాయల్లో కొంత మొత్తాన్ని వీటికి కేటాయించేందుకు కలెక్టర్‌తో కలసి కృషి చేస్తున్నాను.

కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జడ్పీఛైర్మన్

హరివాసరం ఏకాదశి


ఏ పని చేయాలన్నా దశమి, ఏకాదశి చూడడం ఒక అలవాటు. అన్ని తిథుల్లోకెల్లా విశిష్ఠతిథి ఏకాదశి. కోర్కెలను ఫలింపచేసుకోవడానికి, దైవారాధనకు ఎంతో ముఖ్యమైన తిథి ఇది. ప్రతి మాసంలోనూ రెండు పక్షాలుంటాయి. ప్రతి పక్షంలో వచ్చే పదకొండవ తిథి ఏకాదశి. సంవత్సరం పొడవునా సర్వసాధారణంగా 24 ఏకాదశులు వస్తుంటాయి. అధికమాసంలో మరొకటి అధికం. ఈ తిథిలో హరినామ సంకీర్తన చేయడం వలన పుణ్యం కల్గుతుందంటారు. హరికి ఇష్టమైన తిథి కనుకే ఏకాదశికి హరివాసరం అని కూడా పేరుంది. ఏకాదశి నాడు విధిగా ఉపవాసం చేయాలి. వివిధరకాల ఏకాదశులు, వాటికి గల వివిధ పేర్లు, చేసే వ్రతాలు, వాటి వలన కలిగే ఫలితాల గురించి నారదపురాణం పద్యభాగం నాల్గవ పాదం 120వ అధ్యాయంలో వివరంగా చెప్పబడింది. ఆషాడమాసంలో వచ్చే శుద్ధ ఏకాదశిని ప్రథమ ఏకాదశి అని, తొలి ఏకాదశి అని అంటారు. సతీ సక్కుబాయి ముక్తి పొందిన రోజుగా దీనిని చెప్తారు. తొలి ఏకాదశి నుంచి సూర్యుడు దక్షిణం వైపు వున్నట్లు కన్పిస్తాడు. మార్గశిర మాసంలో వచ్చే ఏకాదశిని మోక్ష ఏకాదశి అని, వైకుంఠ ఏకాదశి అని, ముక్కోటి ఏకాదశి అని అంటారు. ఏకాదశుల్లో పరమపవిత్రమైనవి ఇవి. ఈ సమయంలో ఉత్తరాయణం ప్రారంభమవుతుంది. ఈ ఏకాదశుల్లో సూర్యుని సంచారానికి సంబంధించిన అంశాలు ఇమిడి వుంటాయి. ఏకాదశి, ఏకాదశి వ్రతాలు ప్రధానంగా హరిపూజ, దాన ధర్మాలు, ఇంద్రియ నిగ్రహానికి ప్రాధాన్యం ఇచ్చేవిగా వుంటాయి. ఆషాడం నుంచి కార్తీక శుక్ల ఏకాదశి వరకు నాలుగు నెలలపాటు చాతుర్మాస వ్రతం ఆచరిస్తారు. అలాగే కార్తీక శుక్ల ద్వాదశి వరకు గోపద్మ వ్రతాన్ని చేస్తారు. ఇంటి పరిసరాల పరిశుభ్రతకు, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఈ వ్రతాల్లో వున్నట్లు గోచరిస్తుంది. పశువుల కొట్టాలు శుభ్రపరచి పిండితో పద్మాలను వేసి గోవులను పూజించడం చేస్తారు. పశువులు కనుమరుగౌతున్న ఈ కాలంలో పశువుల కొట్టాలు ఎక్కడా కన్పించని పరిస్థితులు నేడు వున్నాయి కాబట్టి ఏకాదశి వ్రతం ఆచరించినా సరిపోతుంది. ఏకాదశి సమయాల్లో నాలుగు నెలలపాటు విష్ణువు పాల కడలిపై శయనిస్తాడు. అందుకే శయన ఏకాదశి అని పేరు వుంది. తర్వాత కార్తీక శుద్ధ ఏకాదశి నాడు విష్ణువు మేల్కొంటాడు కాబట్టి దానిని ఉత్థాన ఏకాదశి అంటారు. ఏకాదశి అవతరణ గురించి వరాహ పురాణం 30వ అధ్యాయంలో వివరించబడినట్లు తెలుస్తున్నది.

కోర్కెలను ఫలింపచేసుకోవడానికి, దైవారాధనకు ఎంతో ముఖ్యమైన తిథి ఏకాదశి.




ట్రంకురోడ్డు

ఆలస్యంగా జనంలోకి...



జిల్లాలో ప్రజారాజ్యం పార్టీ తరపున గెలిచిన ఏకైక ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి. చిరంజీవి ఆయననే ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడిని కూడా చేశారు. కానీ ఇంత వరకు శ్రీధర్‌కృష్ణారెడ్డి జిల్లాలో ఎక్కడా పర్యటించలేదు. పార్టీ అభివృద్ధికి లేశమాత్రమైన కృషి చేయలేదు. నెల్లూరు నగరంలో రూరల్ శాసన సభ్యుడు ఆనం వివేకానందరెడ్డి వెనుక తిరుగుతూ మరగుజ్జుగా మారిపోయారు. అటువంటి ఆయన ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చిరంజీవి జిల్లా పర్యటనను పురస్కరించుకొని ఈవారంలో కొన్ని నియోజకవర్గాల్లో పర్యటించారు. గత ఎన్నికల్లో ఆ పార్టీ తరపున పోటీచేసిన అభ్యర్థులు మినహా పార్టీ క్యాడర్ ఎవరూ ఆయన పర్యటనలో పాలుపంచుకోలేదు. మొత్తానికి ప్రజారాజ్యం పార్టీని శ్రీధర్‌కృష్ణారెడ్డి ఓ పథకం ప్రకారం జిల్లాలో శంకరగిరి మాన్యాలు పట్టించారని ట్రంకురోడ్డులో చిరంజీవి అభిమానులు గుసగుసలాడుతున్నారు.

బాధను మరిపించిన అభిమానం



అభిమానం, అప్యాయతలు ఎంతటి బాధనైనా మరిపింపజేస్తాయన్న విషయం పలుమార్లు రుజువయ్యింది. బాబ్లీ ప్రాజెక్ట్ వ్యవహారమై పోరాడను వెళ్లి మరాఠా పోలీసుల కర్కశ కబంధహస్తాల చిక్కి దెబ్బలు తిని నియోజకవర్గ కేంద్రాలకు తిరిగి వచ్చిన వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, సూళ్లూరుపేట ఎమ్మెల్యే పరసారత్నంకు పార్టీ కార్యకర్తలు సాదర స్వాగతం పలికారు. తమ భుజాలపై ఎత్తుకొని ఊరేగించారు. ఏమాత్రం వెరవక తెలుగుజాతి గౌరవాన్ని ఎలుగెత్తి చాటారంటూ ప్రశంసించేసరికి పాపం ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు ధర్మాబాద్ ఐటిఐలో తమపై జరిగిన లాఠీ దాష్టీకాన్ని సైతం మరచిపోయి మునిముని నవ్వుల మధ్య ఆనంద బాష్పాలు రాల్చారు.



మసాలా వివాదం


వంటకాల్లో, రాజకీయాల్లో చివరికి వార్తల్లోనూ కాస్త మసాలా పడనిదే అవి ఆకట్టుకోవు. ప్రస్తుతం ఈ మసాలా రూరల్ ఎమ్మెల్యే వివేకానంద రెడ్డి, సిపిఎం నేతల మధ్య చిచ్చు పెట్టింది. నెల్లూరులో ఇందిరమ్మ గృహాలు, రేషన్ కార్డులు, పెన్షన్ల మంజూరులోను అవినీతి అక్రమాలు జరగాయని సిపిఎం నేతలు నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఈ దీక్షలు వివేకానందరెడ్డిని చికాకు పెడుతున్నాయి. దీంతో ఆయన మసాలా దోసెలు తిని సిపిఎం నేతలు చేస్తున్న దీక్షలకు ఫలితం వుండదని వారికి ఎవరూ సెలైన్లు ఇచ్చి దీక్ష విరమింపజేయరని వెటకారంగా మాట్లాడాడు. దీనికి ప్రతిగా ఎర్రదండు నాయకుడు జక్కా వెంకయ్య కూడా ప్రతిస్పందించారు. అధికార మదంతో వివేకా అవాకులు చెవాకులు పేలుతున్నాడని ఆయన తలకెక్కిన పొగరును ఉద్యమ పధాన దించుతామన్నారు. మొత్తానికి ఈ మసాలా వివాదం ఘాటెక్కిందనే చెప్పాలి.

శ్రీకృష్ణదేవరాయలు ఫోబియా



ఒక్కో సీజన్‌కు ఓ రకమైన ఫోబియాతో జనం ఊగిపోతారు. విజయనగర సామ్రాజ్య పరిపాలకుడు శ్రీకృష్ణదేవరాయలు పంచమ శతాబ్ది వేడుకలను పురస్కరించుకొని జిల్లాలోని ఏ స్కూల్‌లో చూసినా భువన విజయం నాటక ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఉదయగిరిలో జరిగిన ప్రత్యేక ఉత్సవాల్లో సాంస్కృతిక ప్రదర్శనలన్నీ శ్రీకృష్ణదేవరాయల వారి వైభవాన్ని చాటేవే. జడ్పీ ఛైర్మన్ కప్ పోటీల్లోనూ రాయలవారి దర్బార్‌ను వ్యాయామ ఉపాధ్యాయులు బహుబాగుగా ప్రదర్శించి ఆహూతుల మన్ననలు పొందారు. ఈతరానికి ఈ ఉత్సవాలే రాయలను తెలియజేశాయనడం అతి శయోక్తి కాదు.

చిందేసిన జడ్పీ ఛైర్మన్



ఆటల పోటీలంటే ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుంది. పెద్దలు సైతం చిన్నపిల్లల మాదిరి మారిపోతారు. జడ్పీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి గత నాలుగేళ్లుగా తన స్వంత నిధులు వెచ్చించి నిర్వహిస్తున్న ఛైర్మన్ కప్ పోటీలు వేడుకగా జరిగాయి. క్యాంప్ ఫైర్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని క్రీడాకారులను ఉత్తేజపర్చను కాస్త సీరియస్‌గా కనిపించే జడ్పీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఓ అడుగు ముందుకేసి చిందేశారు. ఇంకేముంది జడ్పీటీసి సభ్యులు, అధికారులు మరింత రెచ్చిపోయి మొత్తానికి క్యాంప్‌ఫైర్‌ను రక్తి కట్టించారు.



మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1 పా

సమాజ కార్యక్రమాలలో పాలు పంచుకొనే వారు ఆర్థిక విషయాలలో జాగ్రత్త వహించకుంటే ఇబ్బందుల పాలవుతారు. కళాకారులకు, వృత్తిపరులకు మేలైన కాలం. గృహిణులు గృహోపకరణాలను కొనడంలో నిమగ్నులౌతారు. వ్యాపారులకు నగదు ప్రవాహం చక్కగా ఉంటుంది. సంతానం మూలంగా సుఖశాంతులు లభిస్తాయి. విద్యార్థులు ఉత్సాహంగా చదువులో నిమగ్నులవుతారు.



వృషభం
కృత్తిక 2,3,4 పా. రోహిణి, మృగశర 1,2 పా

తెలివితేటలతో అవకాశాన్ని జార విడుచుకోకుంటే వృత్తిపరులకు కళాకారులకు మంచి భవిష్యత్తు వుంది. సౌకర్యాలు చక్కగా ఏర్పరుచుకొంటారు. స్త్రీలు బంధువుల సహాయ సహకారాలతో తమ పనుల్ని చక్కగా నిర్వహించుకొంటారు. వ్యాపారులు భాగస్వాములతో జాగ్రత్తగా మెలిగి వారి తోడ్పాటు పొందాలి. విద్యార్థులు అనవసర విషయాలలో జోక్యం చేసుకొని చదువు పాడుచేసుకొంటారు.



మిథునం
మృగశిర 3,4 పా. ఆర్ద్ర,పునర్వసు,1,2,3 పా

ఈ రాశివారికి వివిధ రీతులలో మంచి అవకాశాలు లభిస్తాయి. ఉద్యోగులకు మంచి పురోభివృద్ధి సూచనలు కానవస్తున్నాయి. విద్యార్థులకు శ్రమపై చదువు సాగుతుంది. వ్యాపారులు ప్రభుత్వసంబంధమైన ఇబ్బందులకు గురయ్యే అవకాశాలున్నాయి. జాగ్రత్త వహించాలి. గృహిణులకు అతిథుల రాక ఆనందాన్ని సమస్యల్ని కూడ తెచ్చి పెడుతుంది.



కర్కాటకం
పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష

తమ పనుల్ని చక్కగా నిర్వహించుకొని గృహిణులు మంచి పేరు తెచ్చుకొంటారు. ముందు జాగ్రత్త వహించకుంటే వ్యాపారులు డబ్బుకు కటకటపడతారు. సంతానకారణంగా పెద్దలు మానసిక వేదనకు గురవుతారు. వృత్తిపరుల్ని, కళాకారుల్ని ప్రయాణాలు, నూతన పరిచయాలద్వారా అదృష్టం వరిస్తుంది. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పోటీలలో నెగ్గుకు వస్తారు. కీర్తిప్రతిష్ఠలు పెరుగుతాయి.



సింహం
మఖ, పుబ్బ ఉత్తర 1 పా

గృహిణులు, స్త్రీలు అనుకొన్నవన్నీ సాధించుకొని తృప్తిగా గాలి పీల్చుకొంటారు. రాజకీయులు, సమాజ కార్యక్రమాలలో పాలు పంచుకొనేవారు నిదానంగా తెలివిగా వ్యవహరించాలి. విద్యార్థులు తమ మిత్రులతో జాగ్రత్తగా లేకుంటే సమస్యలు కొని తెచ్చుకోవలసి వస్తుంది. వ్యాపారులు అవసరానికి మించి అప్పులు చేసి ఇబ్బందులు కొని తెచ్చుకొంటారు.



కన్య
ఉత్తర 2,3,4పా, హస్త, చిత్తా 1, 2 పా

తోటివారితో ఉంటూవచ్చిన గొడవలు, సమస్యలు తొలగి ఉద్యోగులు ఊపిరి పీల్చుకొంటారు. ఉత్సాహంతో పనిచేసి మంచి పేరు తెచ్చుకొంటారు. కళాకారులు, వృత్తిపరులు, రాజకీయులు జారవిడుచుకొన్న అవకాశాలను నేర్పుగా, తెలివిగా కష్టపడి తిరిగి పొందే ప్రయత్నాలు చేయాలి. విద్యార్థులు మంచి అలవాట్లతో తమ చదువుపై ఏకాగ్రతను పెంచుకోవాలి.

వారఫలాలు

తేది 30-07-2010 నుండి 06-08-2010 వరకు కర్కాటకంలో రవి; సింహంలో బుధుడు; సింహ, కన్యల్లో శుక్రుడు; మీనంలో గురువు; కన్యలో శని, కుజులు; ధనుస్సులో రాహువు; మిథునంలో కేతువు; మీన, మేష, వృషభాల్లో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

శుభ ముహూర్తాలు

5 తేదీ అన్నప్రాశనాదులకు ఉ.7.00 నుండి 8.30 గంటల వరకు సింహలగ్నాన శుభ ముహూర్తాలున్నాయి.


జూలై తిథులు
ఆషాఢ బహుళ

31	శని	పంచమి	రా.6.32	గం.ల.వ

ఆగష్టు తిథులు

1	ఆది	షష్ఠి	రా.8.25	గం.ల.వ
2	సోమ	సప్తమి	రా.9.49	గం.ల.వ
3	మంగళ	అష్టమి	రా.10.35	గం.ల.వ
4	బుధ	నవమి	రా.10.37	గం.ల.వ
5	గురు	దశమి	రా.9.53	గం.ల.వ
6	శుక్ర	ఏకాదశి	రా.8.23	గం.ల.వ

పి.ఎం.గోపాలాచారి
16/1020, పొగతోట, నెల్లూరు – 1.
E-mail:maripmgg@yahoo.com



తుల
చిత్తా 3,4 పా, స్వాతి, విశాఖ 1,2,3 పా

స్త్రీలు ధారాళంగా డబ్బు ఖర్చు చేస్తారు. అయినా పనుల్లో ఆటంకాలు ఏర్పడతాయి. ధైర్యసాహసాలతో విజయాన్ని సాధిస్తారు. ప్రజాబాహుళ్యంలో ఉన్నవారు, రాజకీయులు తమ శత్రువుల మీదికి దాడి చేయకుండడం మంచిది. కీలెరిగి నడచుకోవాలి. ఎవరికి మాటివ్వకుండడం మంచిది. అనవసరపు విషయాలలో తలదూర్చకుంటే విద్యార్థులు లాభపడే అవకాశం ఉంది.



వృశ్చికం
విశాఖ 4 పా, అనూరాధ, జేష్ఠ

కుటుంబసభ్యుల తోడ్పాటు చక్కగా ఉంటుంది. సంబంధం లేని విషయాల జోలికి పోకుండడం మంచిది. ఆర్థికవిషయాలు కొంత తృప్తికరంగా ఉంటాయి. వ్యాపారులు చక్కని ప్రణాళికలతో క్రయవిక్రయాలలో పాల్గొని మంచి లాభాలనందుకొంటారు. రాజకీయులు తోటివారి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఉద్యోగులకు అధికశ్రమ ఆరోగ్య భంగం ఏర్పడే అవకాశాలున్నాయి.




ధనస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా

మంచి పేరు, ప్రతిష్ఠలు పెరుగుతాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు జాగ్రత్త వహించాలి. అతిగా పోరాదు. నష్టపోయే అవకాశాలున్నాయి. ఉద్యోగస్తులు వాహనాలు కొనే ఆలోచనలను వాయిదా వేసుకోవాలి. అప్పుల జోలికి పోవద్దు. స్త్రీలు త్వరపడి ఇతరులకు ధనసహాయం చేయకుండడం మంచిది. ఇతరులకు అవసరమైతే మంచి సలహాలనందివ్వవచ్చు.



మకరం
ఉత్తరాషాఢ 2, 3,4 పా. శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా

వాహన, విడిభాగాల విక్రేతలు చాలా కష్టపడి పనిచేయాలి. కొత్త కాంట్రాక్టులు లభించే అవకాశాలున్నాయి. సొంత వ్యాపారులు చక్కని పరిశీలనాపటిమతో వ్యాపారవృద్ధి చేస్తారు. అడ్డు పడి ఆగిన రాబడి ఊపందుకొంటుంది. షేర్లు మొదలైన వాటిలో నిల్వ ఉన్న ధనం చేతికందుతుంది. ఆరోగ్యవిషయంలో వైద్యసంబంధిత మైన ముందు జాగ్రత్తలు అవసరం. వాడే మందులు వికటించవచ్చు.



కుంభం
ధనిష్ఠ 3,4 పా. శతభిషం, పూర్వ భాద్ర 1,2,3 పా

పథకం ప్రకారం పని చేస్తేనే రాజకీయులు, సంఘసేవకులు అడ్డంకులు లేకుండా పనులు సాగిస్తారు. పని స్థలంలో నగదు సంబంధం గల ఉద్యోగులు జాగ్రత్త పడకుంటే ఇరకాటంలో పడతారు. కమిషన్ ఏజెంట్లు, కాంట్రాక్టర్లు హుషారుగా ఉండాలి. లేకుంటే చెడ్డపేరు తప్పదు. విద్యార్థులకు, కళాకారులకు వృత్తిపరులకు బాగా కాలం సాగిపోతుంది.



మీనం
పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి

రెప్రజెంటేటివ్‌లు, మార్కెటింగ్ విభాగంలో వున్నవారు చాలా కష్టపడి పనిచేయాలి. కళాకారులు ప్రతి అడుగు జాగ్రత్తగా వేయాలి. అనవసరపు విషయాలలో జోక్యం చేసుకోరాదు. షేర్లు మరియు ఇతర స్పెక్యులేషన్ రంగంలోని వారు నిశిత పరిశీలనానంతరం పెట్టుబడి పెట్టాలి. ఇంటి మరియు ఇతర సమస్యలను మరచి విద్యార్థులు చదువుకు ప్రాధాన్యత నివ్వాలి.

ఆలయ వృత గృహాలకు దృష్టి, దుశ్శక్తి వేధలు!

తులసి జానకిరామ్ నాయుడుపేట

** ఆలయాలు, మసీదులు, స్మశానాలు, ఇతర మత సంస్థల చుట్టూ గృహాలు వుండవచ్చునా?*

సమారంగణ సూత్రధారణ, మయమతం, వాస్తువిద్య, ప్రాచీనకారిక వాస్తు గ్రంథాల్లో ఇట్లా వుంటే దృష్టి, దుశ్శక్తి వేధలు పీడిస్తాయని చెబుతున్నాయి. ఇలాంటి గృహాలలో యజమానుల నామ నక్షత్రాలను బట్టి 'యంత్ర ప్రతిష్టలు' చేసుకోవాలి.

తిరుమన జానకీదేవి కర్నూలు

** అమ్మాయినిచ్చిన చోట 'చిడి' ఎక్కువయింది.*

జాతకం చూశాను. పుష్యరాగం మంచిప్రభావం చూపిస్తుంది. లక్ష్మీగణపతి యంత్రం పరిస్థితిని మారుస్తుంది.

టి.సుందరరామిరెడ్డి గూడూరు

** ఇప్పుడు వాస్తు సరిదిద్దాలంటే కుదరదు. చిట్కాలేమైనా చెప్పండి.*

ముందులేని దూరదృష్టి వల్ల ఇప్పుడు తప్పని సరిగా సరిచేసుకోవాలి. ఈలోగా 'శక్తి' యంత్ర ప్రతిష్ట మీకు ఆపదగలకుండా రక్షిస్తుంది.

మునిరెడ్డి కేశవరెడ్డి చిత్తూరు

** ఆవిడ ఆరోగ్యం మెరుగయింది. చాలా ఆశ్చర్యంగానూ వుంది.*

డాక్టర్లు కూడా ఆపరేషనుకు ముందు ఇష్ట దైవాన్ని శరణువేడి థియేటర్లలోకి వెళతారు. యంత్రప్రతిష్ట, మహిమ ఇప్పటికన్నా గుర్తించారు. సంతోషం.

డి.వి.రుక్మాంగదరావు కందుకూరు

** మా మిత్రుడి గృహం ఫోటోలు పంపిస్తున్నాను. అందులో దోషాలేమిటి?*

ఆ ఫోటోల్లోని గృహపు గదుల్లో ఇంద్ర, కమల, బ్రహ్మ స్థానాలు భ్రంశమయ్యాయి. ప్రణాళికలేని గృహాల్లా వున్నాయి. అందువల్లే వరుస మరణాలు సంభవిస్తున్నాయి.

బి.వేంకటాద్రి నెల్లూరు

** అపార్టుమెంటు ప్లాటులో ఈశాన్యం వంటగది, ఆగ్నేయం బెడ్‌రూము వున్నాయి.*

రెండూ తప్పే. వెంటనే ఖాళీ చేయండి. మీకు ఉత్తర గృహం కలసి వస్తుంది.

సుబ్బారావు గూడూరు

** సొసైటి కాలనీలో ఇల్లు కొన్నాను. ఆర్థిక, ఆరోగ్య పరిస్థితులు పూర్తిగా దెబ్బతిన్నాయి.*

అక్కడ దిక్, స్థానభ్రంశాలెక్కువ. శ్మశానవాటికకు సమీప ప్రాంతం కూడా. కొంత 'భూతవేధ పీడన' కూడా వుంటుంది. వాస్తు సరిచేసుకొని, యంత్ర ప్రతిష్ట తప్పక చేసుకతీరాలి.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

పి.వి.సుబ్బారావు ఒంగోలు

** ఇంట్లో ఆవిడ మానసిక పరిస్థితి ఏమీ బాగోలేదు.*

మూడు మాసాలపాటు తమ రక్షణలో వుంచమన్న 'సైకియాట్రిస్టు' చెప్పినట్లు చేయండి. ఆలోగా 'శక్తియంత్ర' ప్రతిష్ట చేయండి. మీరు పూజలు చెయ్యవచ్చు. తప్పేమీ లేదు.

రావిపాటి సునంద విజయవాడ

** యంత్ర ప్రతిష్ట, రత్నధారణ తర్వాత ఆయన బాగున్నారు. కృతజ్ఞతలు.*

రత్నధారణ శాస్త్రీయం. రంగుల ప్రభావాల్ని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ విభాగం కూడా 1983లోనే నిర్ధారించింది. ఇక యంత్రం మంత్ర బీజాక్షర సమన్వితం. యంత్రం సాక్ష్యాత్ 'ఓం'కార స్వరూపం.

డి.జానకీ విల్సన్ ఆత్మకూరు

** నైరుతిలో వంటిల్లు వుంది. ఆగ్నేయం రహదారి గనుక వీలుపడదు.*

వంటిల్లు వాయువ్యంలో ఏర్పాటు చేసుకోవచ్చు. వీలుకాకపోతే 'లక్ష్మీగణపతి యంత్ర' ప్రతిష్ట చేసుకోండి.

జె.సుమతీ సులోచన సికింద్రాబాద్

** అపార్టుమెంటులో దక్షిణం, పశ్చిమం వైపు ప్లాటు, వ్యూ ఫోటో, వివరాలు పంపిస్తున్నాను.*

నైరుతి, దక్షిణం చివర, పశ్చిమం ప్రారంభం ప్లాట్లు కలసిరావు. మీరు నైరుతి ప్లాటు కొనక పోవడమే మంచిది.

● త్రీ టౌన్ ఎస్‌ఐ పేరుతో

రూరల్ ఎమ్మెల్యే అనుచరుని దండకాలు!



వివాదాలకు నిలయమైన మూడవ నగర పోలీస్ స్టేషన్. (ఫైల్‌ఫోటో)

అతనో సామాన్య వ్యక్తి. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి అనుచరుడిగా వుంటాడు. తాను ఏంచేసినా చెలామణి అవుతుందన్న ఉద్దేశ్యంతో వసూళ్లకు పూనుకున్నాడు. ఈ వసూళ్లు కూడా ఎమ్మెల్యే పేరుతో కాకుండా ఎస్‌ఐ పేరుతో మొదలు పెట్టాడు. ఇంకేముంది రోజుకు వేలాది రూపాయలు వసూలు చేసుకుంటున్నాడు. వసూలు చేసిన మొత్తంలో కొంత భాగం ఎస్‌ఐకి ఇచ్చి మిగిలిన భాగాన్ని జేబులో వేసుకుంటున్నాడు.

ఈ వసూళ్ల కార్యక్రమం ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో జరగడం లేదు. నెల్లూరు నగరంలో బహిరంగంగానే జరుగుతుంది. నగరంలోని మూడవ నగర పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ మామూళ్ల దండకం కార్యక్రమం జరుగుతోంది. సంతపేటకు చెందిన హనుమంతరావు అనే వ్యక్తి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడు. మూడవ నగర ఎస్‌ఐ పెంచలరెడ్డి పేరు చెప్పి మరీ దండకాలు చేస్తున్నాడు. ఈ స్టేషన్ పరిధిలో బ్రాందీ షాపులు, బంగారు దుకాణాలు, వివిధ వ్యాపార సంస్థలు పెద్దసంఖ్యలో వున్నాయి.

అధికారికంగా పెంచలరెడ్డి ఎస్‌ఐ అయితే అనధికారికంగా హనుమంతరావు ఎస్‌ఐగా వ్యవహరిస్తూ స్టేషన్ పరిధిలో అన్నీ తానై చక్రం తిప్పుతున్నాడు. హనుమంతరావు చేస్తున్న అక్రమ వసూళ్ల గురించి స్టేషన్ సిబ్బందికి తెలిసినా కూడా మనకెందుకులే అనుకుంటూ మౌనంగా వుండి పోతున్నారు. పెంచల రెడ్డి ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పైవేటు వ్యక్తుల ప్రమేయం అధికమైంది. వ్యాపారస్తులు తరచూ మామూళ్లు ఇవ్వలేక ఇబ్బంది పడుతున్నారు.

చట్టాన్ని పరిరక్షించి శాంతి భద్రతలను కాపాడాల్సిన ఎస్‌ఐ పైవేటు వ్యక్తులతో చేతులు కలిపి మామూళ్లు వసూలు చేసుకునేందుకు అవకాశం కల్పించడం నేరమైనా కూడా అధికార పార్టీ నేతల అండదండలున్నాయన్న ఏకైక కారణంతో ఈ దందా కొనసాగిపోతుంది. సంతపేట, ములుమూడి బస్టాండ్, మండపాల వీధి, సుబేదారుపేట తదితర ప్రాంతాలలో అక్రమ వసూళ్ల కార్యక్రమం నిరాటంకంగా సాగుతోంది. మామూళ్లు ఇవ్వని వ్యాపారస్తులను బెదిరించడంతోపాటు స్టేషన్‌కు పిలిపించి ఏదో ఒక కేసు నమోదు చేస్తామంటూ బెదిరించిన సాదృశ్యాలు కోకొల్లలు.

షాపును బట్టి మామూళ్లు నిర్ణయిస్తున్నాడు హనుమంతరావు. అతను వస్తున్నాడంటే వ్యాపారస్తులు హడలిపోతున్నారు. వ్యాపారంపైనే ఆధారపడి జీవనం సాగించేవారు ఎందుకు గొడవలని భావించి డిమాండ్ చేసిన మేర నగదు ముట్టజెప్పాల్సిన దుస్థితి ఏర్పడిందంటే ఇతని హవా ఎలా కొనసాగుతుందో ఊహించుకోవచ్చు. మూడవ నగర పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏ వ్యవహారం పరిష్కారం కావాలన్నా ఇతని సలహా తీసుకుంటున్నారు పోలీసులు. ఒక సాధారణ వ్యక్తికి ఇంతటి ప్రాధాన్యత పోలీసులు ఎందుకిస్తున్నారో అర్థం కావడం లేదు.

ఎమ్మెల్యేకి సంబంధించిన వ్యక్తి కావడం వల్ల స్టేషన్‌కు వెళితే విఐపి లాగా అన్ని మర్యాదలు జరుగుతున్నాయి. స్టేషన్‌కు పనిమీద వచ్చిన వారు ఈ దృశ్యాన్ని చూసి ఆశ్చర్యపోక తప్పడం లేదు. జిల్లాలో పోలీసు వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు ఎంతగానో కృషి చేస్తున్న జిల్లా ఎస్పీ దామోదర్‌కు మూడవ నగర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న ఈ సంఘటనలు తెలియరావడం లేదేమో?

అభివృద్ధికి నిధులు

● తీరప్రాంత మండలాల్లో

రోడ్ల నిర్మాణానికి వందకోట్లు!

ప్రకృతి వైపరీత్య సమయాల్లో జనాన్ని తక్షణం తరలించేందుకు మెరుగైన సౌకర్యాల కల్పనలో భాగంగా ప్రపంచ బ్యాంకు తీరప్రాంత మండలాల్లో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది.



బాగా దెబ్బతినిపోయిన అల్లూరు తీరప్రాంతంలోని రోడ్డు. (ఫైల్‌ఫోటో)

జిల్లాలోని తీరప్రాంత మండలాలకు మహర్దశ పట్టనుంది. ఎన్నడూ లేని విధంగా ఈ దఫా కేంద్రప్రభుత్వం భారీనిధులు కేటాయించి తీరప్రాంత మండలాల్లోని రహదారుల్ని నిర్మించనుంది. జాతీయ తుఫాను విపత్తు నివారణ ప్రాజెక్టు ద్వారా ఈ పనులు జరుగనున్నాయి. దీనికి సంబంధించి ప్రపంచబ్యాంకు రాష్ట్రానికి వందల కోట్ల రూపాయల్ని కేటాయించడం జరిగింది.

ప్రపంచ బ్యాంకు కేటాయించిన నిధులతో నాబార్డు పర్యవేక్షణలో, పంచాయితీరాజ్, రోడ్లు, భవనాలశాఖ ఆధ్వర్యంలో గ్రామీణప్రాంత రోడ్ల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుంది. తీరప్రాంత మండలాలైన కావలి, బోగోలు, అల్లూరు, విడవలూరు, ఇందుకూరుపేట, టి.పి.గూడూరు, ముత్తుకూరు, చిల్లకూరు, వాకాడు, చిట్టమూరు, కోట, సూళ్లూరుపేట తదితర మండలాల్లోని రోడ్ల నిర్మాణానికి దాదాపు 13 కోట్ల రూపాయలు ఇప్పటికే విడుదలయ్యాయి.

తుఫాన్ సంభవించిన సమయంలో ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రహదారులు సక్రమంగా లేకపోవడం కారణంగా ప్రజలు, అధికారులు నానా అవస్థలు పడేవారు. తీరప్రాంత గ్రామాల్ని కలుపుతూ రహదారులు ఏర్పాటుచేయాలనే ప్రతిపాదన చాలా సంవత్సరాల నుంచి వుంది. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న రహదారులతోపాటు కొత్తగా కొన్ని రహదారులు ఏర్పాటు చేసేందుకు మార్గం ఏర్పడింది. నిధులు మంజూరు కావడంతో పంచాయితీరాజ్‌శాఖ టెండర్ల నోటిసు జారీ చేసింది.

నూతన రహదారుల నిర్మాణం కోసం టెండర్ నోటిఫికేషన్ జారీ కావడంతో స్థానిక అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు ఈ పనులు దక్కించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. రోడ్లు భవనాలశాఖ, పంచాయితీరాజ్‌శాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ సంబంధిత అధికారులతో సంప్రదింపులు కూడా జరుపుతున్నారు. తీరప్రాంతాలలో చేపట్టే రహదారుల నిర్మాణాలు ఏవిధంగా వున్నా ఎవరూ పట్టించుకోరన్న వుద్దేశ్యంతో కొందరు కాంట్రాక్టర్లు సైతం పైరవీలు చేయించుకుంటున్నారు.

రాష్ట్రంలో వున్న అన్ని తీరప్రాంత మండలాలతోపాటు మన జిల్లాలోని మండలాల్లో చేపట్టే పనులకు ఒకే నోటిఫికేషన్ జారీ చేసింది. పంచాయితీరాజ్‌శాఖలో జూలై 30వ తేది నాటికి టెండర్ల ప్రక్రియ ముగిస్తుంది. జాతీయ తుఫాన్ విపత్తు నివారణ ప్రాజెక్టుకు ప్రత్యేకంగా ప్రపంచబ్యాంకు నిధులు విడుదల చేయడం రాష్ట్రప్రభుత్వానికి కొంత వూరట లభించినట్లయ్యింది. ఆర్థికంగా గడ్డు పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్న రాష్ట్ర ప్రభుత్వం తీరప్రాంతాల్లో రహదారుల నిర్మాణం చేపట్టే అవకాశం లేదు.

పంచాయితీరాజ్‌శాఖ ప్రకటించిన నోటిఫికేషన్‌లో ప్యాకేజీ నెం 31 నుంచి 40 వరకు మన జిల్లాకు సంబంధించిన పనులు వున్నాయి. జిల్లాలో త్వరితగతిన పనులు పూర్తి చేస్తే తీరప్రాంతంలోని అన్ని గ్రామాల ప్రజలు తుఫాన్ సమయంలో సురక్షితంగా విపత్తు నుంచి బయటపడే అవకాశం వుంటుంది. చెన్నారెడ్డి హయాంలోలా ఈ రోడ్లను కాస్త నాణ్యతగా నిర్మిస్తే బాగుంటుంది.



పాపం... అసిన్!

కేరళ కుట్టి అసిన్‌ను కష్టాలు చుట్టుముట్టాయి. హిందీ గజిని చిత్రం విజయంతో ఆమె దక్షిణాది చిత్రాల్లో నటించదని భావించి ఇక్కడ అడిగేవారు లేకపోయారు. అక్కడ ఆ తర్వాత నటించిన సినిమాలు దెబ్బతినడంతో దక్షిణాదిపాట మొదలెట్టినా తమిళహీరోలు, దర్శకులు నవ్వి ఊరుకున్నారు. ఇటీవల ఆమెకు సల్మాన్ సరసన ఓ చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. షూటింగ్ శ్రీలంకలో. దీంతో దక్షిణభారత చలన చిత్ర మండలి ఆమెపై అగ్గిమీద గుగ్గిలమయ్యింది. శ్రీలంకతో సినిమా సంబంధాలపై ఆంక్షలున్న నేపథ్యంలో అసిన్ అక్కడికి ఎలా వెళ్తుందని రభస మొదలయ్యింది. దీంతో మరోదారి కనపడని అసిన్ షూటింగ్ గ్యాప్‌లో శ్రీలంకలోని తమిళులను కలుసుకొని మాట్లాడుతూ కొన్ని సేవా కార్యక్రమాలు చేపట్టింది. ఇటువంటి సేవలకు తమిళ తంబీలు కూల్ అవుతారని ఆమె నమ్మకం.

కష్టపడతానండీ!



ఈ మధ్య అవయవ సంపద పుష్టికి సర్జరీలు చేయించుకొంటున్నదని వార్తల్లో నిలచిన హీరోయిన్ కంగనారనౌత్ వీటిని ఖండిస్తూ తాను అభినయాన్నీ, అందాన్ని నమ్ముకొని పరిశ్రమకు వచ్చినట్లు చెబుతుంది. ఈ విషయమై వివరిస్తూ ఓ సినిమా ఒప్పుకున్నానంటే అది పూర్తి అయ్యేంతవరకూ నాకు నిద్రపట్టదు. పాత్ర కోసం ఎంతో ఆలోచిస్తాను. ఏదో వచ్చామా? చేశామా? వెళ్లామా అన్నట్లు సెట్‌లో ప్రవర్తించను. మనం చేస్తున్న ప్రతి పని సెట్‌లో అందరూ గమనిస్తారు. ముఖ్యంగా సినిమా అనేది మాస్ మీడియా. దీన్ని మంచిగా ఉపయోగిస్తేనే సమాజానికి ఉపయోగమంటుంది ఈ గిరిజాల జట్టు సుందరి.

సలోని సంతోషం!



ఒక ఊరిలో, ధన 51 చిత్రాల్లో హీరోయిన్‌గా నటించినా సలోనికి రావాల్సినంత గుర్తింపు రాలేదు. సునీల్ హీరోగా రాజమౌళి దర్శకత్వంలో తీసిన మర్యాదరామన్న చిత్రంలో హీరోయిన్‌గా ఛాన్స్ దక్కించుకొన్న సలోని చాలా సంతోషంగా వుంది. ఈ విషయమై మాట్లాడుతూ మర్యాదరామన్నను రాజమౌళి అద్భుతంగా తెరకెక్కించారు. ఈ సినిమా షూటింగ్‌కు పనిచేసిన ప్రతిరోజునూ, ప్రతి సన్నివేశాన్ని ఆస్వాదించా. రాజమౌళి దర్శకులే కాదు. ఒక విద్యాలయం. ప్రతి విషయాన్నీ క్షుణ్ణంగా చెబుతారు. చెప్పడమే కాదు చేసి చూపిస్తారు. నాకు తెలిసి ఆయన ఒక గొప్ప నటుడు. సెట్‌లో ఎప్పుడూ హుషారుగా వుంటారు. ఆయన ప్రక్కనుంటే ఎవరూ, ఏ విషయంలోనూ సందేహపడాల్సిన అవసరం రాదని చెప్పుకొచ్చింది సలోని.

గ్లామర్ పాత్రలకు దూరంకాను!



బాలీవుడ్‌లో హీరోయిన్‌గా నిలదొక్కుకొన్న తెలుగమ్మాయి సమీరా రెడ్డి. గ్లామర్ హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకొన్న సమీరా ఇటీవల రెడ్ అలర్ట్ పేరుతో రూపొందించిన చిత్రంలో నక్సలైటు పాత్రలో దర్శనమిచ్చింది. ఈ సినిమా బాక్సాఫీసు దగ్గర బోల్తా కొట్టినా సమీరాకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. ఇటీవల హైదరాబాద్ వచ్చిన ఆమె మాట్లాడుతూ ఒక్కసారిగా నక్సలైటు మహిళగా కనిపించారు. ఇక గ్లామర్ ఒలకబోసే పాత్రల్లో కనిపించరా అంటూ అందరూ అడుగుతున్నారు. కాని ఇది వాస్తవం కాదు. నక్సలైటు పాత్ర బాగా నచ్చడంతో పాటు సవాలుగా అనిపించడంతో మనసు పెట్టి చేశాను. భవిష్యత్తులో ఏ తరహా పాత్రలో కనిపించడానికైనా సిద్ధంగా వున్నాను. శృంగారాత్మక చిత్రాల్లోనూ కనిపించి నా అభిమానులను అలరిస్తానని తేల్చి చెప్పింది.



రాజకీయాలు నాకు పడవు!

దేశంలోనే విలక్షణ నటునిగా పేరు గాంచిన కమల్‌హాసన్ సినీజీవితం ఆరంభమయ్యి 50ఏళ్లు దాటిన సందర్భంగా ఇటీవల ఢిల్లీలో ఆయన్ను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనను కలసి ఇక రాజకీయాల్లోకి వస్తారా అంటే 25ఏళ్లుగా ఈ ప్రశ్న అడుగుతున్నారు. నేను పొరపాటున కూడా రాజకీయాల్లోకి రాను. ఇష్టం లేని పని పొరపాటున చేయను. నాకు నటించడం ఒక్కటే తెలుసు. అందులోనే ఆత్మసంతృప్తి పొందుతాను. ఇప్పటికీ పలువురు నా నటన భారతీయ తరహాలో వుండదని విమర్శిస్తుంటారు. నిజమే యూరోపియన్... స్వీడిష్... జపనీస్ సినిమాలు నన్ను ప్రభావితం చేస్తుంటాయి. అవన్నీ నా నటనలో కలపడం వల్ల కొత్తకొత్తగా ప్రేక్షకుల ముందుకు వస్తుంటానన్నారు.



ఆకట్టుకోని శుభప్రదం!

అల్లూరు రహీం

కళాతపస్వి కె.విశ్వనాథ్ దర్శకత్వం వహించిన సిరిసిరి మువ్వ, సప్తపది, శంకరాభరణం, సాగర సంగమం, సిరివెన్నెల, స్వయంకృషి, స్వాతిముత్యం చిత్రాలు కళాఖండాలు. వీటిగూర్చి ఎంత చెప్పుకొన్నా ఇంకా కొంత మిగిలేవుంటుంది. గ్లామర్, మసాలా పాటలు అంటూ కథ విడిచి సాము చేస్తున్న ఈ రోజుల్లో సంస్కృతి, సంప్రదాయం, సంగీతం, సాహిత్య విలువలతో సినిమా తీయడం పెద్ద సాహసమే. శ్రీరాజరాజేశ్వరి ఫిలిమ్స్ ప్రై లిమిటెడ్ పతాకంపై నిర్మాతలు హరి గోపాలకృష్ణమూర్తి, విఎన్.తిలక్ పెద్ద సాహసం చేసి తీసిన చిత్రమే శుభప్రదం. ఈ సినిమాకు కె.విశ్వనాథ్ కథతోపాటు స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు నెరవేర్చారు. ఈ సినిమా పేరైతే గొప్పగా వుంది గాని కథలో పస లేదు. కథనం, మంచిపాటలు, సంగీతం, చిత్రీకరణలో తనదైన శైలిలో కె.విశ్వనాథ్ చేసిన ప్రయత్నం ఫలించలేదు. ప్రథమార్ధమంతా హీరో నరేష్‌ను కేంద్రంగా చేసుకొని నడిపిన కామెడీ కథ గొప్పగా లేదు. ద్వితీయార్ధంలో కళాశాలల్లో జరుగుతున్న ర్యాగింగ్‌పై దృష్టి పెట్టి సృష్టించిన సన్నివేశాలు పేలవంగా వున్నాయి. ఇప్పటి సినిమాలు తాను చూడనని, తాను అసిస్టెంట్‌గా పనిచేసిన ఆదుర్తి సుబ్బారావు వద్ద నేర్చుకొంది ఏమీ లేదని, సన్నివేశాలు తీయడం ఒకరు నేర్పాలా అని గట్టిగా వాదించే విశ్వనాథ్ శుభప్రదం సినిమా అపవిజయం తాలుకు అపప్రధను మూటగట్టుకొని వెనక్కు వెళ్లక తప్పదేమో? అయితే శుభప్రదంలో సాహితీ విలువలు గుబాళించేలా ఆయన తీసిన తప్పెట్లో, చల్లనయ్య రామయ్య, మౌనమే చెబుతుంది, నీ నవ్వేకడదాకా చెలిమి, బైలెల్లె... బైలెల్లె పల్లకి చరణాలతో సాగే పాటలు మృదుమధురం. వీటికి తన ధోరణికి భిన్నంగా సంగీతం కూర్చిన మణిశర్మను మెచ్చుకోవాల్సిందే. చాలా రోజుల తర్వాత ఈ చిత్రానికి మాటలు వ్రాసిన ఎంవిఎస్.హరనాథరావు కామెడీ కలగలసిన డైలాగులు వ్రాయడంలో విఫలమయ్యాడు. ఆయన మాటల్లో సామెతలు, కాపీ మాటలు కనపడ్డాయి. ఐదు పైసలకు కార్డు ముక్క అంటాడు ఒక చోట. కార్డు ముక్క 50 పైసలు అయిన విషయం కూడ ఈ పెద్ద మాటల రచయితకు తెలియకుంటే ఎలా? ఈ చిత్రానికి కె.విశ్వనాథ్ సినిమాలకు ఎప్పుడూ పనిచేసే కె.సాయినాథ్ కథా విస్తరణకు, సీతారామశాస్త్రి పాటలు, బాలసుబ్రహ్మణ్యం గాత్రం, జిజి.కృష్ణారావు ఎడిటింగ్‌లో కనిపించారు. సీనియర్ దర్శకుడు ఎస్.బి.చక్రవర్తి, నండూరి విజయ్ ఈ సినిమాకు కోడైరక్టర్లుగా పనిచేసినా ఫలితం లేదు. కేరళతోపాటు గోదావరి అందాలను కెమెరామెన్ వేణుగోపాలన్ మాత్రం అద్భుతంగా తెరకెక్కించాడు.

చిత్రకథలోనికి వెళ్తే రాజరాజేశ్వరిపురంలో కొండ మీద భక్తులను డోలి మీద మోసుకవెళ్లే కూలీ చక్రి (నరేష్) సడన్‌గా కేరళలో ప్రత్యక్షమవుతాడు. అక్కడికి తెలుగువారి సంఘం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నేతృత్వంలో నిర్వహించే సంగీత విభావరిలో పాల్గొని ఇందు (మంజరి)ని ఆకర్షిస్తాడు. మంజరి నాన్న (వైజాగ్ ప్రసాద్) చాలా రోజుల క్రితం ఆంధ్ర నుంచి కేరళవెళ్లి అక్కడి సరస్సులలో నడిచే బోర్డింగ్ బోట్స్‌ను నిర్వహిస్తుంటాడు. చిన్న చిన్న సంఘటనలతో ఇందు, చక్రికి దగ్గరై పోతుంది. అతడు తన గూర్చి ఆమెకు పలు అబద్దాలు చెబుతాడు. వైజాగ్ ప్రసాద్ చక్రికి ఇందునిచ్చి పెళ్లి చేయను స్థాయి స్థోమత అడుగుతాడు. గిల్టు నగలు చూపి ఇందును పెళ్లి చేసుకొని తీసుకెళ్తూ చక్రి ఆమెకు అసలు విషయం చెబుతాడు. నిదానంగా ఇందు అతన్ని అర్థం చేసుకొని హాయిగానే కాపురం చేస్తుంటుంది. ఇంతలో వీరికి రైల్వేస్టేషన్‌లో గతంలో తారసపడ్డ శివా నందమూర్తి (శరత్‌బాబు) అస్వస్థుడుగా కనపడతాడు. ఆయనను తన ఇంటికి తీసుకొచ్చిన ఇందు కేరళ వైద్యం చేసి కోలుకొనేలా చేస్తుంది. వాస్తవానికి శివానందమూర్తి కోటీశ్వరుడు. ఆయన మనుమరాలు సింధు(మంజరి) లానే వుంటుంది. కాలేజిలో ర్యాగింగ్‌కు గురయ్యే అనంతాచారి (ప్రసాద్)ను రక్షించే క్రమంలో కరాటే చేసే ఆమె ముఖంపై ఎస్పీ కుమారుడు యాసిడ్ పోస్తాడు. అనంతాచారి తనకు జరిగిన అవమానానికి మానసికరోగి అవుతాడు. సింధు మరణించడంతో చపలచిత్తుడైన శివా నందమూర్తి దేశదిమ్మరిగా తిరుగుతూ ఆమెనే పోలివుండే ఇందు చేరదీసి సపర్యలు చేయడంతో కోలుకొంటాడు. ఆమెకు తన ఆస్తి మొత్తం ఇవ్వాలనుకొనే తరుణంలో నిరాకరించి అనంతాచారిని దత్తు చేసుకోమనడంతో కథ శుభప్రదమవుతుంది.

కామెడీ బాగా పండించే నరేష్ ఈ చిత్రంలో కాస్త కలతపడుతూ నటించినట్లు కనపడతాడు. గ్లామర్ హీరోయిన్ మంజరి ఈ చిత్రంలో కుందనపు బొమ్మలా కనపడుతూ చక్కని నటన ప్రదర్శించింది. శరత్ బాబు, రాళ్లపల్లి, గిరిబాబులతోపాటు ఓ పాటకు ఉపోద్ఘాతం చెప్పే సమయంలో కె.విశ్వనాథ్ తెరపై కనపడతారు. కె.విశ్వనాథ్ సినిమా ఎలా వున్నా చూసే ఆయన అభిమానులు ఈ చిత్రానికి వెళ్లొచ్చు.



సిపిఎం దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బి.వి.రాఘవులు. వేదికపై జక్కా వెంకయ్య, చంద్రమోహన్‌రెడ్డి, మాదాల వెంకటేశ్వర్లు తదితరులు.

వివేకాను గత్తరపెట్టిన సిపిఎం దీక్షలు!

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, అర్హులకు గృహ వసతి కల్పించాలని కోరుతూ సిపిఎం చేపట్టిన ఆమరణ దీక్షలు ఎట్టకేలకు అధికారుల హామీతో ముగిశాయి. గాంధీబొమ్మ వద్ద ఏర్పాటుచేసిన శిబిరంలో డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు షాహినాబేగం, మస్తాన్‌బీ, శ్రీనివాసులు తదితరులు దీక్షలు చేపట్టారు. ఈ దీక్షల వలన పేదలకు లబ్ధి చేకూరడం సంగతి ప్రక్కన బెడితే సిపిఎం, అధికార కాంగ్రెస్ పార్టీల మధ్య మాటల యుద్ధానికి దారితీశాయి. కమ్యూనిస్టులు చేస్తున్న నిరసన దీక్షలనుద్దేశించి రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానంద రెడ్డి తనదైనశైలిలో వ్యాఖ్యలు చేశాడు. సిపిఎం నేతలు చేస్తున్న దీక్షల వలన ఏమీ కాదని, మసాలా దోశలు తింటూ కాలక్షేపం కోసం వారు శిబిరంలో కూర్చొన్నారని

ఓర్చుకోలేక తిట్లు

వ్యంగ్యంగా విమర్శించారు. వారి ఆరోగ్యం దెబ్బతిన్నా దీక్షను భగ్నం చేయమని, సెలైన్ ఎక్కించమంటూ పోలీస్ యంత్రాంగం తమ చెప్పుచేతుల్లో వుందన్నట్లుగా తీవ్ర వ్యాఖ్యలు చేయడం కామ్రేడ్లకు కోపం తెప్పించింది. జక్కా వెంకయ్య, భానురాజులు వివేకాకు పట్టిన అధికార మదం దించుతామని అంతే ఘాటుగా సమాధానం ఇచ్చారు. దీక్షా శిబిరాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బి.వి.రాఘవులు సందర్శించి వివేకా చేసిన వ్యంగ్య వ్యాఖ్యానాలకు తీవ్రంగా స్పందించారు. పేదలకు నువ్వుచేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం అంటూ టైము, ప్లేసు నువ్వే చెప్పు అంటూ సవాల్ విసిరారు. దీనికి వివేకా రాఘవులను పరుష పదాలతో దూషించారు. ఉదయం కమ్యూనిస్టుగా వుండే రాఘవులు రాత్రికి క్యాపిటలిస్టుగా మారుతాడని, పార్టీని సర్వనాశనం చేసిన ఆయన స్టార్ హోటళ్లలో తిరుగుతూ మద్యం సేవించాలని కోరిక కల్గినపుడు నెల్లూరు వస్తారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వీరి మధ్య పానకంలో పుడకలా ఎంటరైనాడు టిడిపి జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి. కూలింగ్ గ్లాస్‌పెట్టి, స్పోర్ట్స్ కార్లలో తిరిగే వివేకాకు అభివృద్ధి గురించి ఏం తెలుసని తనదైనశైలిలో మాట్లాడడంతో వివేకానందరెడ్డి సోమిరెడ్డిపైనా విరుచుకపడ్డాడు. సిక్స్‌ప్యాక్ బాడీ కల్గిన సోమిరెడ్డి నన్ను విమర్శించాడని హావభావాలతో సోమిరెడ్డి బక్కపల్చని దేహం గురించి నానామాటలు మాట్లాడాడు. మూడు పార్టీల నేతల మధ్య జరుగుతున్న తిట్లదండకం నగర వాసులకు మంచి కాలక్షేపం అయ్యింది.

సామాన్యుల వ్యధలే నా పాటలు!

నెల్లూరులో సుద్దాల అశోక్‌తేజ



విలేకరులతో మాట్లాడుతున్న అశోక్‌తేజ. ప్రక్కన ఉన్నం బసవయ్య.

నా సినీ జీవితంలో ఠాగూర్ చిత్రానికి వ్రాసిన పాట జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు సాధించి పెట్టిందని ప్రముఖ సినీకవి సుద్దాల అశోక్‌తేజ తెలిపారు. తన తండ్రి సుద్దాల హనుమంతు పేరు మీద ప్రజానాట్య మండలి టౌన్‌హాలులో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వారి ఆహ్వానం మేరకు నగరానికి వచ్చిన ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన తాను తనికెళ్ల భరణి సహకారంతో చిత్రరంగంలోకడుగిడానని వినమ్రంగా చెప్పారు. తండ్రి హనుమంతు నుంచి వారసత్వంగా వచ్చిన అక్షరజ్ఞానానికి తోడు సమాజాన్ని దగ్గర నుంచి గమనించడం, పేదలు, వివిధ వృత్తుల వారు పడుతున్న అవస్థలు, విప్లవ భావాలు తనలో వున్న కవిని రగిల్చాయన్నారు. ఆ జ్వాల నుంచి వెలువడిన గీతాలు పలువురి ప్రశంసలు అందుకొనేందుకు కారణమయ్యాయన్నారు. తన స్వగ్రామమైన సుద్దాల తర్వాత కాలంలో తన ఇంటి పేరైందన్నారు. ఒకటి రెండు చిత్రాల్లో నటించినా, పలు సంగీత కార్యక్రమాల్లో జడ్జిగా కన్పిస్తున్నా రచనలకే తొలి ప్రాధాన్యం అన్నారు. ఠాగూర్ సినిమాలో శ్రీశ్రీ వ్రాసిన పల్లవులను అలానే వుంచి చిరంజీవి కోరిక మేరకు క్రొత్తగా చరణాలను వ్రాసానని ఆ పాట జాతీయ అవార్డును తెచ్చిపెట్టిందన్నారు.

ఆశల పల్లకిలో కార్పొరేటర్లు!

లు లేదు చూలు లేదు కొడుకు పేరు సోమనాథం అన్నట్లుంది నగరంలో మునిసిపల్ కార్పొరేటర్ల వ్యవహారశైలి. ప్రస్తుత మునిసిపల్ పాలకవర్గం గడువు ముగియనుండడంతో తిరిగి పాలకవర్గానికి ఎన్నికలు జరుగనున్నాయి. ఎప్పుడు ఎన్నికలు వుంటాయో ఇంకా ఒక నిర్ణయానికి ప్రభుత్వం రాకముందే నగరంలో మాత్రం ఆశావహులు ఎవరికి వారు ప్రజలను ఆకట్టుకొని కార్పొరేటర్‌గా నిలచేందుకు పోటీలు పడుతున్నారు. ప్రస్తుతం కార్పొరేటర్లుగా కొనసాగుతున్న వారు తిరిగి అదే పదవిని పొందేందుకు ఉవిళ్లూరుతుండగా, గత ఎన్నికల్లో టిక్కెట్ ఆశించి భంగపడినవారు, క్రొత్త వారు వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా టిక్కెట్లు సాధించి ఎన్నికల్లో పోటీచేసి నెగ్గాలని తెగ ఆరాట పడుతున్నారు. ఈ పోటీ అన్ని పార్టీల వారిలోనూ వుంది. అధికార కాంగ్రెస్ పార్టీ తిరిగి మునిసిపల్ ఎన్నికలలో గెలచి అధికారాన్ని హస్తగతం చేసుకోవాలని అనుకుంటుంటే, అదే రీతిలో తెలుగుదేశం ఎలాగైనా ఈసారి తమ బలం చాటుకోవాలని ప్రయత్నిస్తుంది. కమ్యూనిస్టులు తమ సంఖ్యాబలాన్ని పెంచుకొనేందుకు, క్రొత్తగా ఏర్పడిన ప్రజారాజ్యం పార్టీ తమ సత్తా చాటేందుకు సమాయత్తం అవుతున్నాయి. ఈ పరిస్థితులలో ఎవరికి వారు తమ తమ ప్రాంతాలలో పోటీ చేయడమో లేదా రిజర్వేషన్ల కారణంగా వేరే చోటికి మారి పోటీ చేయడమా అనే దానిపై మల్లగుల్లాలు పడుతున్నారు. రిజర్వేషన్లు, సమీకరణలతో ఇప్పటి నుంచి ఆశావహులు చాపక్రింద నీరులా పలు ప్రయత్నాలు చేసుకొంటున్నారు.

ఎన్నికలపై అనిశ్చితి!

ఎక్కడి ఫైళ్లు అక్కడే!

దిక్కు దివాణంలేని డిఇఓ ఆఫీసు.

జిల్లా విద్యాశాఖలో ఫైళ్లు పేరుక పోతున్నాయి. ప్రాధాన్యత గల ఫైళ్లను క్లియర్ చేయాల్సినప్పటికీ వాటి వలన ఎలాంటి ఉపయోగం వుండదని సిబ్బంది భావించడమే ఈ సమస్యకు కారణం. ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన ఫైళ్లను ఆగమేఘాల మీద క్లియర్ చేసే సిబ్బందికి ఉపాధ్యాయులతో ముడిపడి వుండే ఫైళ్ల గురించి పట్టదు. చేయి తడపందే ఫైళ్లను తాకని విద్యాశాఖ సిబ్బంది కొందరికి ప్రైవేట్ పాఠశాలల నుంచి వచ్చే ఫైళ్ల కాసులు కురిపిస్తుండడంతో ఎప్పుడెప్పుడు వారి నుంచి ఫైళ్లు వస్తాయా, ఎంత తొందరగా వారి పనిచేసిపెడదామా ఎంత మేర లబ్ధి పొందుదామా అన్న ధ్యాస తప్ప ఇతర ఫైళ్ల ప్రస్తావన పట్టదు. దీంతో ఫైళ్లు కార్యాలయంలో పేరుకపోతున్నాయి. వీటిలో మెడికల్ రీఎంబర్స్‌మెంట్‌కు సంబంధించిన ఫైళ్లు వుండడంతో దీనికోసం దరఖాస్తు చేసుకొన్న పలువురు ఉపాధ్యాయులు నెలల తరబడి రీఎంబర్స్‌మెంట్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడి నుంచి డైరక్టరేట్‌కు ఫైలు కదలాలంటే ఆయా సిబ్బంది అడిగినంత ఇవ్వకుంటే మెడికల్ ఫైళ్లు కదలడం లేదని పలువురు ఉపాధ్యాయులు వాపోతున్నారు. డిఇఓ బాలకాశయ్యకు కార్యాలయ సిబ్బందిపై పట్టులేకపోవడం, గ్రూపుల బెడద కారణంగా నామమాత్రం అయ్యారు.



నెల్లూరీయుడు సికింద్రాబాద్ కెనరా బ్యాంక్‌లో ఉద్యోగి ఎం.మధుసూధనరావు కుమారుడు వంశీకృష్ణ, అశ్వినిల వివాహం జూన్ 30వ తేది సికింద్రాబాద్‌లోని అణుపురం కమ్యూనిటీ హాలులో జరిగింది.

క్రిక్కిరిసిన సాయిబాబా మందిరాలు

గురు పూర్ణిమను పురస్కరించుకొని జులై 25వ తేది ఆదివారం నగరంలోని షిరిడిసాయి బాబా మందిరాలు భక్త జనంతో క్రిక్కిరిసి పోయాయి. గాంధీనగర్‌లోని బాబా ఆలయం, చిల్ట్రన్స్ పార్కు వద్ద గల సాయి ఆలయంతోపాటు పలుచోట్ల ఇదే సందడి. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు, హారతులు, అన్నదానాలు నిర్వహించారు. రెండు రోజుల ముందునుంచే మందిరాలను విద్యుత్ కాంతులతో అలంకరించారు. నిప్పో సెంటర్‌లో సంగీత విభావరి నిర్వహించి భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. బాలాజీనగర్ త్యాగరాయ కళ్యాణ మండపంలో సింహపురి ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో వేటూరి స్మృత్యర్థం సంగీత కార్యక్రమం జరిగింది. చిన్నారులు వేటూరి కలం నుంచి జాలువారిన అత్యద్భుత గీతాలను పాడి విన్పించారు. గాంధీనగర్ సాయిబాబా ఆలయ ట్రస్టు ప్రతి ఏడాది నిర్వహించే ప్రఖ్యాత రామాయణ వ్యాఖ్యాత డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు పురాణ కాలక్షేపం కోఆపరేటివ్ బ్యాంకు ఆవరణలో జరిగింది.



చిల్డ్రన్స్ పార్కు సాయిబాబా మందిరంలో భక్తుల పూజా పునస్కారాలు.

అయ్యో పాపం వైఎస్

మొదటి పేజీ కొరవ

అధిష్టానం తనను గుర్తించడం లేదని ఆక్రోశపడ్డాడు. ప్రజాస్వామ్యంలో వారసత్వం సమర్థనీయమా కాదా అన్నది వేరే చర్చ. ఇక్కడ పరిశీలించాల్సిన విషయం – వైఎస్ అభిమానులు, అనుచరులు అనుకొన్న వారు జగన్ పక్కన నిలబడుతున్నారా లేదా అన్నది మాత్రమే. తన యాత్రతో నలభై యాభై మంది ఎమ్మెల్యేలు, పెద్దసంఖ్యలో మంత్రులు కలిసి వస్తే, రాష్ట్రంలో రోశయ్య ప్రభుత్వం కంపిస్తుందని, ఆ స్థితి సృష్టిస్తే తప్ప అధిష్టానంలో కదలిక రాదని జగన్ వ్యూహం. ఆ మాత్రం సంఖ్య చేరుకోవడం మంచినీళ్లు త్రాగినంత సులభం అని భ్రమపడ్డాడు జగన్. కానీ మూడు వారాల ఓదార్పు యాత్ర తర్వాత ఆయనకు తీవ్ర ఆశాభంగం మాత్రమే మిగిలింది. రాజశేఖర్‌రెడ్డి ప్రజలకు చేసింది కొంచెం. కానీ వారు కోకొల్లలుగా వచ్చి తమ విశ్వాసం ప్రదర్శించారు. ఎమ్మెల్యేలు, మంత్రులకు వైఎస్ చేసింది చాలా ఎక్కువ. కానీ వారు మాత్రం జగన్‌తో వస్తే తమ పదవులకు ముప్పు అన్న భయంతో ముఖం చాటేశారు.

రాజకీయాలలో విశ్వాసం, కృతజ్ఞత అన్న మాటలకు స్థానం లేదు. అయితే అది కేవలం రాజకీయం అయినప్పుడే. కానీ రాజశేఖర్‌రెడ్డి తన వారనుకొన్న వారికి రాజకీయ పదవులతో పాటు అధికారాన్ని, అంతులేని సంపదను దోచి పెట్టాడు. మొరటుగా చెప్పాలంటే ఆకలితో వున్నవాడికి కడుపు నింపే కూడు పెట్టాడు. కానీ ఆయన అభిమానులనుకొన్న వారిలో ఆ కూడు తిన్న కృతజ్ఞత లేశ మాత్రం కన్పించడం లేదు. అందరూ చెప్పే సాకు, అధిష్టానం అనుమతి లేదని. శాసనసభ సమావేశాలు జరిగినన్ని రోజులు ఆ నెపం బాగానే పని చేసింది. కానీ ఆ తర్వాత లండన్ నుంచి తిరిగి వచ్చిన వీరప్ప మొయిలీ, జగన్ ఓదార్పు యాత్ర తప్పు కాదని, దానిలో పాల్గొనే వారిపై చర్యలుండవని స్పష్టంగా ప్రకటించాడు. వీరప్ప మొయిలీ అంటే అధిష్టానం క్రింద లెక్క అయినా సరే ఎమ్మెల్యేలు, మంత్రులు హైదరాబాద్ నుంచి కాలు కదపలేదు. జగన్‌తో కలిసి నడవలేదు.

అట్లా వెళ్తే తాము కాంగ్రెస్ పెద్దల దృష్టిలో పడతామని, భవిష్యత్తులో ప్రమాదం వాటిల్లుతుందని భయపడ్డారు. మామూలు కాంగ్రెస్‌వాదులైతే ఆ భావాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ కేవలం రాజశేఖర్‌రెడ్డి పుణ్యం వల్ల, దయ వల్ల రాజకీయ ప్రాభవానికి వచ్చినవారు కూడా అదే వాదన విన్పిస్తే ఎట్లా? ఆయన బ్రతికి వున్నప్పుడు నిప్పుల్లో దూకడానికి సై, గొంతు కోసుకొని ప్రాణాలివ్వడానికి సిద్ధం అని బీరాలు పలికినవారు ఆయన లేనప్పుడు ఆయన కొడుకు కోసం అవసరమైతే తమ పదవులు పణంగా పెట్టలేరా?

రాజశేఖర్‌రెడ్డి ఫ్యాక్షన్ నేపథ్యంలో పుట్టి పెరిగినవాడు. తమ నీడను కూడా తాము నమ్మలేక పోవడం ఫ్యాక్షన్ రాజకీయాల ప్రథమ సూత్రం. తమ కారు డ్రైవర్ పక్క కారు డ్రైవర్‌తో మాట్లాడడం చూస్తే చాలు, ఏదో జరుగుతున్నదని అనుమానిస్తారు ఫ్యాక్షన్ నేతలు. తమ వారనుకొన్నవారు పొరపాటున కూడా ఇటు అటు చూపులు సారించడం క్షమించరు. తన మనిషి అంటే తనతోనే వుండాలి. తన కోసం ప్రాణం ఇవ్వాలి. అట్లా వుండేవారినే తమ దగ్గర పెట్టుకొంటారు. వారి కోసం తమ సర్వస్వం ఒడ్డుతారు. రాజశేఖర్‌రెడ్డి చేసింది కూడా అదే. కానీ అంత సుదీర్ఘ ఫ్యాక్షన్ చరిత్ర, అనుభవం కల్గిన ఆయన కూడా రాజకీయాలలో ఎంత అమాయకంగా బోల్తాపడి పోయాడో ఆయన అనుచర ఎమ్మెల్యేలు, మంత్రుల తీరు చూస్తే అర్థమైపోతుంది. జగన్ అంచనా వేసుకొన్నట్లు నలభై యాభై మంది ఎమ్మెల్యేలు ఓదార్పు యాత్రలో పాలుపంచుకొని వుంటే, ఒక వేదిక మీద చేరి సంఘీభావం తెలిపి వుంటే రాష్ట్ర రాజకీయాల తీరు మారిపోయి వుండేది. దానివల్ల జగన్‌కు అధికారం వస్తుందా రాదా అన్నది వేరే విషయం. కానీ రాజశేఖర్‌రెడ్డి కొడుకుగా జగన్ అవసరంలో వున్నప్పుడు అండగా నిలవడం రాజశేఖర్ రెడ్డి చేతి కూడు తిన్న వారి కనీస ధర్మం. దానివల్ల వారి పదవులకు ముప్పేమీ లేదు. ఒకేసారి నలభై, యాభై మంది ఎమ్మెల్యేలు తమ మాట ధిక్కరిస్తే, అందరినీ పార్టీ నుంచి వెలి వేసేంత మూర్ఖత్వం కాంగ్రెస్ అధిష్టానానికి లేదు. మూకుమ్మడి చర్యలు తీసుకొంటే ప్రభుత్వాన్ని చేజార్చుకోవాల్సి వస్తుందని వారికి తెలుసు. ఈరోజుకు ఈరోజు దేశంలో కాంగ్రెస్ పార్టీకి వున్న ఏకైక పెద్ద రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే. తతిమావన్నీ ఢిల్లీ, హర్యానా వంటి చిన్న చిన్న రాష్ట్రాలు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్, గుజరాత్, కర్ణాటక వంటి పెద్ద రాష్ట్రాలు వేటిలోనూ కాంగ్రెస్ అధికారంలో లేదు. అందువల్ల ఎట్టి పరిస్థితులలోనూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వాన్ని కూలదోసుకొనే తప్పిదం చేయదు. జగన్ నిజంగా అధిష్టానాన్ని కదలించే స్థాయి బలప్రదర్శన చేసి వుంటే, ఏదో ఒక రాజీకి వచ్చి వుండేది. ఆయనకు ముఖ్యమంత్రిత్వం ఇవ్వలేక పోయినా కేంద్రంలోనే, మరొక రూపంలోనూ సముచిత స్థానం ఇచ్చి వుండేది. ఇవ్వక తప్పదు కూడా. అంత మొండిగా పోతే ప్రభుత్వం కూలిపోతుంది. దానివల్ల జగన్‌కు లాభమా నష్టమా అన్న చర్చ పక్కన పెడితే, కాంగ్రెస్ అధిష్టానానికి మాత్రం పూడ్చుకోలేని నష్టం.

మెడ మీద తలకాయ వున్న వాడికెవడికైనా ఈ రాజకీయ సూత్రం అర్థమౌతుంది. కానీ రాజశేఖర్‌రెడ్డి కోసం నిప్పులో దూకుతామని భీషణ ప్రతిజ్ఞలు చేసిన ఎమ్మెల్యేలు, మంత్రులకు మాత్రం అధిష్టానాన్ని కాదంటే కలియుగాంతం వచ్చేస్తుందన్న భావన కల్గింది. ఆయన దయా ధర్మం మీద బ్రతికిన ఒక్కరికి కూడా ఆయన కొడుకు కోసం అధిష్టానాన్ని ధిక్కరించే ధైర్యం కలగలేదు. జగన్ కోసం ఆ చిన్న సాహసం కూడా చేయలేక పోయారు. ఇటువంటి వారినా రాజశేఖర్‌రెడ్డి తన మనుషులుగా భావించి, అన్ని నిందలు పడి, అంత చేసింది అన్పిస్తున్నది. ఆయనే ఇప్పుడు బ్రతికి వస్తే, ఇటువంటి వారిని చేరదీసినందుకు నొచ్చుకొని తీరుతాడు. ఆయన్ను చూస్తే అయ్యోపాపం అనాలన్పిస్తున్నది. రాజశేఖర్‌రెడ్డి అనుయాయుల స్వార్థం వల్ల, పదవుల మమకారం వల్ల జగన్ రాజకీయ భవిష్యత్ చులకన ప్రాయమైపోయింది. నేను ఒంటరి వాడిని అని పదే పదే ఆవేదన చెందే పరిస్థితి ఏర్పడింది.

విస్తరిస్తే వినాశనమే

మొదటి పేజీ కొరవ

టారు. దానివల్ల జగన్‌కు బలం చేకూరుతుంది. అది ప్రభుత్వానికి వినాశనం క్రిందనే లెక్క. అందువల్ల ఇప్పట్లో మంత్రివర్గ విస్తరణ వూసెత్తక పోవడమే క్షేమమని రోశయ్య తలపోస్తున్నాడట. మరీ తప్పదనుకొంటే నలుగురైదుగురు కొత్త వారిని తీసుకొని, సరిపెడతాడని, వున్న వారిని వూడబెరికే సాహసం చేయబోడని పరిశీలకుల అంచనా.

సిపిఎం ఆఫీసు

16వ పేజీ కొరవ

ఒకప్పుడు అటు అధికారులు, ఇటు పాలక పక్షం రాజకీయవాదులు కమ్యూనిస్టులను చూసి భయపడేవారు. తప్పులు జరిగితే నిలదీస్తారని జాగ్రత్త పడేవారు. సిపిఎం ఆఫీసు మీద వాలడానికి ఈగలు కూడా భయపడేవి. నగరంలో, పల్లెల్లో కూడా పార్టీ కోసం ప్రాణమిచ్చే కార్యకర్తలుండేవారు. వారికి స్ఫూర్తి కల్గించే రీతిలో నాయకులు మసలుకొనేవారు. ఇప్పుడు ఎవరి వ్యాపారాలు వారివి. ఉద్యమాలు లేవు, కార్యక్రమాలు లేవు, కార్యకర్తలను పట్టించుకొనే వారూ లేరు.

ఆనం వివేకానందరెడ్డి రాజకీయ జీవితానికి ఒళ్లంతా చిల్లులే. వెతికి చూసినా మెచ్చుకోదగిన లక్షణం ఒక్కటీ కన్పించదు. అటువంటి అపభ్రంశుడు రాఘువులు వంటి సచ్చీలుడి మీద ఆరోపణ బురద చల్లగలిగాడంటే, సిపిఎం ఏ స్థాయికి పతనమై పోయిందో అర్థం చేసుకోవచ్చు. అంత హీన స్థితిలో పార్టీని నడపడం కంటే, ఆఫీసు మూసేసి, రామచంద్రారెడ్డి ఆస్పత్రికి ఇచ్చేయడం ఉత్తమం.

మేము నిజాయితీగా ఉన్నామని చెప్పుకోవడం జక్కా వెంకయ్యకు, భానురాజుకు అలవాటు. రాజకీయాలలో నిజాయితీ ఒక్కటే చాలదు. సమర్థత కూడా కావాలి. సమర్థతలేని నిజాయితీ వ్యర్థం. తమ నేతృత్వంలో తమ పార్టీ ఎంతగా నిర్వీర్యమై పోతున్నదీ వారిద్దరూ ఆత్మపరిశీలన చేసుకొంటే, ఆ పార్టీ ఇక ముందైనా బాగుపడుతుంది.

జనవాణి

2వ పేజీ కొరవ

కొడవలూరు, పార్లపల్లి, తుమ్మగుంట, పద్మనాభ సత్రం రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరయ్యేలా కోవూరు శాసనసభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి తగిన చర్యలు తీసుకోమనవి.

ఎస్.నిత్యసంతోషి, రామతీర్థం

వెంకటగిరిలో శీనయ్య స్మృతి చిహ్నమేది?

వెంకటగిరి మాజీ శాసనసభ్యురాలు నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మ చొరవతో కొత్త గ్రంథాలయం భవన నిర్మాణం జరిగింది. ఈ గ్రంథాలయం కోసం స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి గారు గతంలో శాసనసభ్యులుగా వున్నప్పుడు అసెంబ్లీలో ప్రస్తావించారు. వెంకటగిరి మీదుగా వెళ్లే కెపికెనాల్ కూడా శ్రీనివాసులురెడ్డి కృషి ఫలితంగా వచ్చింది. వెంకటగిరిలో నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి స్మృతికి చిహ్నంగా గ్రంథాలయం లేదా కెపి.కెనాల్‌కు ఆయన పేరు పెట్ట మనవి.

ఎన్.పవిత్ర, వెంకటగిరి

కార్యకర్తలను పట్టించుకోవడం లేదు!

పల్లకి మోసిన బోయిలను మరచిన చందాన కాంగ్రెస్ పార్టీ గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పట్టించుకోవడం లేదు. ఈ విషయాన్ని నేదురుమల్లి జనార్దనరెడ్డి, పనబాక లక్ష్మిల దృష్టికి తీసుకవెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. ఆనం సోదరులు కూడా ఇదే బాటన నడుస్తున్నారు. డిసిసి అధ్యక్షుడు ఎల్లసిరి గోపాలరెడ్డికి ముఖ్య కాంగ్రెస్ కార్యకర్తలెవరో గుర్తు లేనట్లుంది. కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తలను గుర్తిస్తారని ఆశించడం ఒట్టిమాట అనిపిస్తుంది.

జి.రామకృష్ణప్రసాద్, గంగవరం

నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

పార్టీ దెబ్బతిని పోతుందని పసల బాధ పడ్డారు. అయినా పసల సలహా వినే నాయకులెవరు?

ఓదార్పు అవిఘ్నమస్తుకు 1001 టెంకాయలు!

కడప ఎమ్పీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి సాగిస్తున్న ఓదార్పు యాత్రకు ఎలాంటి ఆటంకాలు కలుగకూడదని, ఆయనకు ఆయురారోగ్యాలు సహకరించాలని, దుష్టశక్తుల నీడ యాత్రపై పడకూడదని పిసిసి కార్యదర్శి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి 'అవిఘ్నమస్తు' పూజ చేయించారు. 23వ తేది నెల్లూరు టౌన్‌హాల్ వినాయకుడి గుడి వద్ద 1001 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో జగన్మోహన్‌రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

మహమ్మద్ రఫీ మ్యూజికల్ నైట్ 31న!

నెల్లూరు నగరంలో గత 17 ఏళ్లుగా మహమ్మద్ రఫి కల్చరర్ అకాడమీ నేతృత్వంలో జరుగుతున్న మ్యూజికల్ నైట్(యాదే రఫీ) 31వ తేది రాత్రి కస్తూరిబా కళాక్షేత్రంలో జరుగుతుంది. దుబాయ్ గాయకులు ఎహ్‌తెషామ్, సిమ్రన్‌లతోపాటు స్థానిక గాయకులు ఇబ్రహీం, అస్లాం, మున్నా, జీలు, గౌస్ బాషా, అహ్మద్ షరీఫ్, జావేద్, సుజాత, శిరీషలు గానార్చన చేస్తారు. మహమ్మద్ రఫీ అభిమానులను ఈ మ్యూజికల్ నైట్‌కు తరలి రమ్మంటున్నాడు కార్యక్రమ నిర్వాహకుడు జాకీర్ హుస్సేన్.

వివేకాలా భానుశ్రీ!

వీరు వారవుతారన్న సామెతను గుర్తుచేస్తూ నెల్లూరు మేయర్ భానుశ్రీ మునిసిపల్ కార్యాలయంలో చెత్త టిప్పర్‌ను నడిపారు. 26వ తేది కొత్త టిప్పర్ల ప్రారంభోత్సవంలో ఈ సంఘటన చోటు చేసుకొంది. సహజంగా ఇటువంటి పనులు వివేకానందరెడ్డి చేస్తుంటారు. ప్రస్తుతం భానుశ్రీ స్వీకరించారు. ఈ కార్యక్రమానికి వివేకానే స్వయంగా పచ్చజెండా ఊపడం విశేషం.

కాకాణిని కొనియాడిన జడ్పీటీసీలు!

జిల్లా పరిషత్ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి నాలుగేళ్ల పాలన పూర్తి చేసుకొన్న సందర్భంగా జడ్పీలో అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా జడ్పీటీసీలు పార్టీలకతీతంగా మాట్లాడుతూ కాకాణి గోవర్ధన్‌రెడ్డి సేవలను కొనియాడారు. కొందరు జడ్పీటీసీలు మిమ్మల్ని మళ్లీ జడ్పీ ఛైర్మన్‌చేసే పూచీ మాదని గట్టిగా చెప్పారు. గోవర్ధన్‌రెడ్డి వారిని నిలువరించారు.

కృష్ణదేవరాయలు కృష్ణాంశ సంభూతుడా?

(గతవారం తరువాయి)

రాయలు 1529లో మరణించాక అచ్యుత దేవ రాయలు 1529–30లో శ్రీకాళహస్తిలోనూ, హంపీ, విజయనగరంలోనూ పట్టాభిషేకాలు చేసుకున్నాడు.

తిమ్మరసును, అతని తమ్ముడు గోవిందరాజును రాయలు అంధుల్ని చేయలేదనడానికి ఆధారం, వారిని అచ్యుత దేవరాయలు తాను రాజ్యానికి వచ్చిన వెంటనే వారిని విడిపించి వారికి పదవులు కట్టబెట్టిన చారిత్రక ఆధారాలే. కుట్రదారులైన తిమ్మరుసు, గోవిందరాజు, నాగమనాయకుడు అచ్యుతుని కాలంలో ప్రధాన పదవుల్లో కొనసాగారు. గోవిందరాజు అచ్యు

చరిత్ర వెలుగులు - కొన్ని కొత్త కోణాలు

తుని శిరః ప్రధానిగా బాధ్యతలు స్వీకరించాక అచ్యుత దేవరాయల అభ్యుదయాన్ని కోరుతూ తిరుమలేశునికి గ్రామదానం చేస్తూ 5 నవంబరు 1541న శాసనం వేయించారు. అచ్యుత దేవరాయల కోరిక మేరకు తిమ్మరసు శ్రీ వెంకటేశ్వరునికి 'మల్లపురం' అనే గ్రామాన్ని జనవరి 1వ తేది 1537లో దానం చేశాడు. ఈ విషయాల్ని తిరుమల శాసనాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఆధారాలను బట్టే నేను తిమ్మరుసు అంధుడు కాలేదన్న నిర్ధారణకు వచ్చాను. ఎందుకంటే అంధుల్ని రాజ పదవుల్లో వుంచరు.

రాయల ద్వితీయ భార్య చిన్నాదేవి వేశ్యా?

యవ్వనంలో చంద్రగిరిలో వున్నప్పుడు రాయలు చిన్నాదేవిని ప్రేమించాడని, ఆమె వేశ్య కుమార్తె అని, ఆమె అసలు పేరు గాండ్ల సంగ అని చాలా కథలు ప్రచారంలో వున్నాయి.

కృష్ణరాయల తల్లి నాగమాంబ విషయంలోనూ ఆమె దాసి అని, తక్కువ జాతి కులస్థురాలనీ, వేశ్య అని ప్రచారాలు జరిగాయి. న్యూనిజ్‌లాంటి విదేశీ యాత్రికులు సైతం అప్పటి ప్రచారాలను నమ్మి ఆ విషయాల్ని గ్రంథస్థం చేశారు. వాస్తవానికి నాగమ్మ సుక్షత్రియులైన 'సాగి' వంశస్థుల ఆడపడచు. నాగమ్మ తండ్రి గండికోట ప్రభువుగా కొన్నాళ్ళున్నాడు. సవతి మాత్సర్యంతో కుటిలురాలైన తిప్పాంబ, ఓబాంబికలు నాగమాంబపై ఆకాలంలో విష ప్రచారాలు చేయించారు. ఇలాంటి ప్రచారాలే చిన్నాదేవి విషయంలోనూ జరిగాయి. వాస్తవానికి చిన్నాదేవి శూద్ర కులస్థురాలు. అందువల్లే తిమ్మరుసు, నరసరాయలు ఆమెకు రాయలకు వివాహం చేయడానికి ఇష్టపడలేదు. అయితే కృష్ణదేవరాయలు మొండిపట్టు పట్టాడు. ఇక వారికి తప్పలేదు. అందువల్ల తుళువ నరసరాయలు తన తండ్రికి విశ్వాసపాత్రుడు, తన సామంతుడూ అయిన కుమార వీరయ్య(శ్రీరంగపట్నం) కుమార్తె తిరుమలాంబను మొదట రాయలతో వివాహం జరిపించి(క్రీ.శ 1498) తర్వాత క్రీ.శ 1499 – 1500లలో చిన్నాదేవితో వివాహం జరిపించారు. ఈమె వల్ల వేంగళాంబ అనే కుమార్తె కలిగింది. వేంగళాంబను ఆర్వీటి తిరుమలరాయలకిచ్చి వివాహం చేశారు. ఈ తిరుమలరాయలు రాయల మొదటి అల్లుడు అళియరామరాయలకు స్వయానా తమ్ముడు. నిజంగా చిన్నాదేవి వేశ్య కుమార్తె అయితే వేంగళాంబ పైనా ఆమె కుమారుడైన ఆర్వీటి రెండవ వేంకటపతిరాయలపైనా(క్రీ.శ 1585 – 1614) ఎన్నో ప్రచారాలు జరిగి వుండేవి. ఈ ప్రస్తావనలన్నీ అంతఃపురంలో జరిగిన కుట్రలని నా అభిప్రాయం.

చిన్నాదేవి మనుమడైన రెండవ వేంకటపతి శ్రీకృష్ణదేవరాయల తర్వాత అంతటి ప్రఖ్యాతి కలిగిన వాడు.



ఉదయగిరి గోపాలకృష్ణ మందిరం గాలిగోపురంపై అపురూప శిల్ప సంపద.

ఇలవేల్పు కృష్ణుడు!

శ్రీకృష్ణుడిలా రాయలు గూడా అష్టమి రోజు జన్మించాడు. నాగమాంబ యింటి ఇలవేల్పు శ్రీకృష్ణుడు. అంచేత రాయలకు కృష్ణరాయలని పేరు పెట్టుకున్నారు.

రాయలకు గూడా తాను శ్రీకృష్ణాంశసంభూతుడనే అభిప్రాయం వుండేది. ఈ విషయం చాలా చారిత్రక శాసనాల్లో కూడా కనిపిస్తుంది. క్రీ.శ 1513లో ఉదయగిరిని తిమ్మరుసు సారధ్యంలో జయించినపుడు ఉదయగిరిలోని బాలకృష్ణుడి విగ్రహం రాయల్ని విపరీతంగా ఆకట్టుకొంది. అందుకని ఆ విగ్రహాన్ని హంపీ విజయనగరానికి తీసుకెళ్లి అక్కడ ఉన్నఫళంగా బాల కృష్ణాలయం నిర్మింపజేశాడు.

క్రీ.శ 1513 – 14 మధ్యలో రాయలు విడుదల చేసిన వరాహనాణేలపై(బంగారువి) కూర్చున్న భంగిమలో వున్న శ్రీకృష్ణుడు, రెండోవైపు నాగర లిపిలో శ్రీప్రతాపకృష్ణరాయ అని వుంది. నాణెం బరువు 1.75 గ్రాములు.

తిరుమలదేవితో అరణంగా వచ్చిన నంది తిమ్మన(ముక్కు) తన పారిజాతాపహరణంలో రాయలకు శ్రీకృష్ణుడికి భేదమే లేదంటాడు. ఇతను తుళువ నరసానాయకుడి ఆస్థాన కవులైన(క్రీ.శ 1493–15

పాయసం సుబ్రహ్మణ్య మహర్షి

05) వరాహపురాణం కర్తలు ఘంట సింగన ద్వయానికి స్వయానా మేనల్లుడు. తిమ్మన పద్యం చూడండి.

యాదవత్వమున సింహాసనస్థుడుగామి అనే పద్యంలో చివర

"... భువనైక మాన్యలీల
నవతరించిన కృష్ణుడౌననగమించె
సరస విభుకృష్ణరాయ భూనాయకుండు".

(సమాప్తం)

ప్రేమను మృదు మధురంగా చెప్పే మధువని!

ఏదో చెప్పాలని ఉంటుంది. రాయాలనిపిస్తుంది. అంతరంగంలో ఒక తహతహ, ఒక తపన. అప్పుడు హృదిలోని భావాలు కాగితం మీద పెట్టేగానీ ఊరుకోనివ్వని అశాంతి, ఆరాటం ఊరట పొందదు. ఈ అనుభవం మాటలకు అందని అలజడి.

నెల్లూరు మునిసిపాలిటీలో గుట్టుగా ఉద్యోగం చేసుకొంటూ సంసారం వెళ్లదీసుకొనే ఒక సగటు మనిషి నవల రాయడానికి సమకట్టాడంటే ఇదిగో ఈ లోలోపలి తహతహ ఊరుకోనివ్వనికనే. ఇరగబోయిన జానకిరామయ్య 'మధువని' నవల రాశాడు. రాసి అచ్చువేసుకొనే ఆర్థిక పరిస్థితి లేక ఊరుకొన్నాడు. బహుశా పదిహేనేళ్ల తర్వాత ఆయన కుమారుడు శ్రీనివాసరావు నాన్నగారి నవల చదివి, ముచ్చటపడి అచ్చువేయించాడు.

'మధువని – కథ' అని ముఖ పత్రం మీద ఎందుకు వేశారోగానీ, రచయిత నవలనే అన్నాడు. ఇందులో నవలా లక్షణాలు సమగ్రంగా ఉన్నాయి. ఒకరినొకరు ఎరగని ఇద్దరు యువతీ యువకులు లేఖల ద్వారా, కలం స్నేహం ద్వారా ఆత్మీయులౌతారు. "అలా ఉత్తరాలతో ఒకరిపై ఒకరు అభిమానాన్ని పెంచుకొంటారు". ఇంటర్నెట్లో చాటింగ్ ద్వారా పరిచయాలు పెళ్లిళ్లకు దారితీసినట్లు అపోహలు, ఒకరి కోసం ఒకరు ప్రేమను త్యాగాలు చెయ్యడాలు వగైరా సంఘటనలతో కథ సాగుతుంది. నవలలో మలుపులు తిప్పడానికి రచయిత దుష్ట పాత్రలను ప్రవేశ పెట్టడు.

రచయిత 'మధువని' నవలలో మధ్యతరగతి, ఆపై వర్గాల జీవిత విధానాన్ని నోరూరించేట్లు వర్ణించాడు. బంగళాలు, ముంగిట్లో లాన్‌లు, పూలచెట్లు, కార్లు... ఓహ్! ఒక అద్భుత స్వప్నలోకం! 1960 దశకంలో వారపత్రికల్లో ధారావాహికగా ప్రచురించబడడానికి అన్ని అర్హతలు ఉన్న నవల. ఏంచేద్దాం నాలుగు దశాబ్దాలు ఆలస్యంగా అచ్చయ్యింది.

"మనిషి మనుగడ ఆ అన్వేషణ. ఊహకందని పయనంలో ఎన్నో మలుపులు, ఎన్నో సమస్యలు ఉత్పన్నమవుతాయి. అవి కష్టసుఖాలను, సుఖ దుఃఖాలను చవి చూపుతాయి" అంటారు రచయిత. యువతీ యువకులు జీవితంలో స్థిరపడేకాలం అద్భుతమైన కాలం. నవలల్లో సాధారణంగా ఈ రుతువే ఇతివృత్తంగా వుంటుంది. దిక్కులేని ఒక పసివాడు రైలు పట్టాల మధ్య స్పృహతప్పి పడి ఉంటే, ఇంజను డ్రైవరు ఆ బాలుణ్ణి కాపాడి వెంటబెట్టుకొని పోతాడు. ఆ పసివాడే కిరణ్. పెద్ద చదువులు చదివి గొప్ప సాకర్ క్రీడాకారుడు, అటవీ శాఖాధికారి అవుతాడు. పదవీ విరమణ చేసిన జిల్లా వైద్యాధికారి ముద్దుల కూతురు కీర్తి. ఇద్దరి మధ్య స్నేహం ప్రణయంగా మారి సుఖాంతమవుతుంది.

పుస్తకసమీక్ష

మధువని

రచయిత : **ఇరగబోయిన జానకిరామయ్య**
సమీక్షకుడు : **డాక్టర్ కాళిదాసు పురుషోత్తం**

ప్రతులకు
రచయిత,
204, యాదవులవీధి,
మూలాపేట, నెల్లూరు – 524003

నవల ఇతివృత్తంలో విశేషం లేదుగానీ రచయిత భాష గురించే నే చెప్పదలచినది. పాత్రల సంభాషణలు ఎంత చాతుర్యంతో, సహజంగా నిర్వహించాడా అని ఆశ్చర్యపోక తప్పదు. రచయితకు భాష మీద ఉన్న పట్టు చూసి ముగ్ధుణ్ణయ్యాను. రచయిత తానుగా కథ చెప్తున్నప్పుడు కూడా కథనం ధారాళంగా సాగుతుంది. కథా శిల్పంలోనూ, నేర్పరితనం చూపించాడు. సారా వ్యసనానికి బానిసై ఎటో వెళ్లిపోయిన ఇంజను డ్రైవరు కథ ముగింపుకు సహకరిస్తాడు. ఇతర పాత్రలు కూడా అంతే అర్థవంతంగా తోడ్పడుతాయి.

కథానాయకుడు ప్రపంచ సాకర్ పోటీల్లో పాల్గొని భారతదేశానికి స్వర్ణపతకం సాధించడం వంటి, మన ఊహకందని విషయాలు రాయకుండా. క్రికెట్ ప్లేయర్ అని వర్ణించి ఉంటే సరిపోయేది. ఇటువంటివే చిన్న చిన్న లోపాలు... ముసురు పట్టిన ఒక రాత్రి ఏమీ తోచని వేళ హాయిగా ఈ నవల చదువుతూ గడిపేయొచ్చు.

సిపిఎం ఆఫీసు మూసేయడం మేలు!

రాఘవులును విమర్శించే ధైర్యం వివేకాకు ఎక్కడిది?

పెంట మీద రాయి వేయొద్దని పెద్దోళ్లు వూరికే చెప్పలేదు. ఆ హితోక్తి చెవికెక్కించుకోక పోవడం ఎంత పెద్ద పొరపాటో బాగా అర్థమైంది సిపిఎం రాష్ట్ర నేత బివి.రాఘవులు గారికి. నెల్లూరు నగరంలో ఇందిరమ్మ ఇళ్ల అవకతవకలపై తమ పార్టీ సభ్యులు చేస్తున్న నిరాహార దీక్షలకు



సంఘీభావం తెలపడం కోసం వచ్చిన ఆయనకు జన్మలో మరిచిపోలేని గుణపాఠం నేర్పి పంపాడు ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి.

నెల్లూరు శివార్లలోని కొత్తూరు గ్రామం దగ్గర 6వేల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతున్నది. ఆ పని వివేకా అనుచరులైన కాంగ్రెస్‌వాదులకు కాంట్రాక్ట్ ఇచ్చారు. సిమెంటు రోడ్లనే బూడిదపోసి వేసే ఘనులు వారు. పేదల ఇళ్లని జాలి వారికెక్కడ నుంచి వస్తుంది. బూడిదతో చేసిన రాళ్లతో తూతూ మంత్రంగా కట్టిపారేస్తున్నారు. ప్రారంభానికి ముందే అవి ఉరుస్తున్నాయి. పగుళ్లిస్తున్నాయి. ఈ అక్రమాలపై చర్య తీసుకోవాలని సిపిఎం స్థానిక నేతలు గాంధీ బొమ్మ వద్ద నిరాహార దీక్ష చేశారు. వారిని అధికారులెవరూ పట్టించుకోలేదు. అన్నం మానేసి దీక్ష చేస్తే మీరే చచ్చి వూరుకొంటారు, మాకేమి నష్టం అన్నట్లు చూస్తూ వుండిపోయారు. రాష్ట్ర స్థాయి నేత వస్తే అయినా అధికారులలో కదలిక వస్తుందనే ఉద్దేశంతో రాఘవులును ఆహ్వానించింది జిల్లా కమిటీ. ఆయన వచ్చి ఇక్కడి పరిస్థితులన్నీ తెలుసుకొని, ఎమ్మెల్యే నిర్వాకం వల్లనే ఇంత దుర్మార్గం జరుగుతున్నదని విమర్శించారు. చాలా మామూలు రాజకీయ విమర్శ ఇది. కానీ దానికి వివేకా స్పందన మాత్రం వేరొక రకంగా వచ్చింది. ఇందిరమ్మ ఇళ్ల అక్రమాల గురించి వివరణ ఇవ్వడం మాని, రాఘవులు మీద ఆరోపణల బురద క్రుమ్మరించాడు. రాఘవులు మందు త్రాగడానికే నెల్లూరు వస్తాడని, ఫైవ్‌స్టార్ హోటళ్లలో విలాసాలు అనుభవిస్తాడని, ఆ వ్యసనాల కోసం పార్టీని తాకట్టు పెడతాడని అర్థం పర్థం లేని ఆరోపణలు చేశాడు వివేకా.

పెంట మీద రాయి వెయ్యడం అంటే ఇదే. రాఘవులు వ్యక్తిత్వ స్వచ్ఛత తెలిసినవారికి ఆ ఆరోపణలు చాలా బాధ కల్గిస్తాయి. సిపిఎం కార్యకర్తలకే కాదు, సగటు రాజకీయ పరిశీలకులు కూడా అసహ్యించుకొనే తప్పుడు మాటలవి. రాఘవులుకు త్రాగుడు వ్యసనం లేదు. ఫైవ్ స్టార్ హోటళ్ల చిరునామాలు కూడా తెలియదు. అత్యంత నిరాడంబర జీవితం ఆయనది. పార్టీ ఆఫీసు మిద్దె మీదనే, నీళ్ల ట్యాంక్ పక్కన చిన్న గుడారం వంటి ఇంట్లో నివాసం. రాత్రి పగలు పార్టీ సేవ తప్ప మరొక వ్యాపకం లేదు. ఖాళీ దొరికితే చేతికందిన పుస్తకం చదువుకోవడం తప్ప షికార్లు, తిరుగుళ్లు వుండవు. నిజమైన కమ్యూనిస్టు జీవిత విధానానికి నమూనా వంటి నడవడిక. అటువంటి వాడిని పట్టుకొని త్రాగుబోతు, తిరుగుబోతు అని నింద వేస్తే ఏమని సమాధానం చెప్పాలి, ఎటువంటి వివరణ ఇవ్వాలి? వివేకా సంస్కారం అంతవరకే అని ఒకే ఒక మాట చెప్పి సరిపెట్టుకొన్నాడు రాఘవులు.

నిజానికి రాఘవులు స్థాయికి వివేకా వంటి అర్భకుల గురించి మాట్లాడడం పొరపాటు. వివేకా తత్వం అందరికీ తెలిసిందే. తాను సమాధానం చెప్పలేని పరిస్థితి వచ్చినప్పుడు నోరు పెద్దది చేసుకొని, క్రూరమైన నిందలు వేసి ఎదుటివాడి మతి పోగొట్టడం ఆయనకు అలవాటు. రాఘవులు విషయంలోనూ అదే సూత్రం పాటించాడు. ఇందిరమ్మ ఇళ్ల అవకతవకకు వివేకా దగ్గర సమాధానం లేదు. అవి అధ్వాన్నం చతుర్మధ్యంగా వున్న మాట వాస్తవం. ఆ ఇళ్లలో మనిషన్నవాడు కాపురం చేయలేడన్నది నిజం. ఆ దుర్మార్గానికి కారకులు తన అనుచరులు. ఆరువేల మంది పేదలు ఇళ్లు నష్టపోవడం కంటే, అరడజను మంది అనుచరులు ఆర్థికంగా లాభపడడమే ఆయనకు ఇష్టం. ఆ తప్పు కప్పి పెట్టాలంటే, సమస్యను పక్కదారి పట్టించాలి. ఆయన సంస్కారానికి తెలిసినదారి అభాండాలు మోపడం మాత్రమే. పైకి ఎగిరి పడడమే పెంట లక్షణం. దాని మీద రాయి వెయ్యడం వేసే వాడి అమాయకత్వం.

నెల్లూరు జిల్లాలో సిపిఎం ఎంతటి దీనావస్థలో వుందో, ఎంతగా దిగజారి పోతున్నదో అర్థం చేసుకోవడానికి ఇదొక చిన్న ఉదాహరణ. గత పది పదిహేనేళ్లుగా కమ్యూనిస్టులు అన్నివిధాల దిగజారి పోయారు. ఇళ్ల స్థలాల దురాక్రమణలు, రియల్ ఎస్టేట్ మోసాలు, రౌడీ మధ్యస్థాలు చేసే వారికి అశ్రమం వలె తయారయ్యింది సిపిఎం నెల్లూరు జిల్లా కార్యాలయం. అక్రమ వ్యాపారాలు చేసే వారికి రాజకీయ అండకావాలి. పలువురు కమ్యూనిస్టులు ఈ అవసరం కోసం వివేకాను ఆశ్రయించడం అందరికీ తెలిసిన నిజం. ఆ మొగమాటంతోనే నెల్లూరు నగరంలో జరిగే ఏ అక్రమం పైన కూడా సిపిఎం పార్టీ తన నిరసన తెలపలేక పోతున్నది. గత పదేళ్లలో సిపిఎం ఒక్క ప్రజాసమస్య మీద అయినా పూర్వపు వేడి వాడితో పోరాటం చేసిన సాదృశ్యం వుందా? జిల్లాలో ఎన్ని సమస్యలు లేవు? కృష్ణపట్నం పోర్టు పేరుతో, ఎస్ఇజడ్ పేరుతో జరుగుతున్న భూదుర్మార్గాలు అన్నీ ఇన్నీ కావు. థర్మల్ స్టేషన్లకు విచ్చలవిడిగా ఇస్తున్న అనుమతుల వల్ల జిల్లాకు జరగబోయే నష్టం వూహించడానికి కూడా భయం వేస్తున్నది. అపాచీ ఫ్యాక్టరీలో కార్మికులను వెట్టివాళ్ల కంటే హీనంగా చూస్తున్నారు. నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ దోపిడీకి నిలయంగా మారిపోయింది. జలయజ్ఞం కాంట్రాక్ట్ పనులు ప్రజలకు తీరని అపకారం చేస్తు



న్నాయి. కానీ ఏ సమస్య మీద కూడా సిపిఎం కనీసపాటి స్పందన కూడా చూపడం లేదు. కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం నుంచి నెల మామూళ్లు దండుకోవడానికి చూపే శ్రద్ధలో వీసమెత్తు కూడా దానివల్ల అక్కడి మత్స్యకారులకు జరుగుతున్న దురన్యాయాన్ని నిరసించడంలో కన్పించడం లేదు. కమ్యూనిస్టు ఉద్యమం, పార్టీ యంత్రాంగం నిర్వీర్యమై పోయాయి. సిపిఎం పార్టీ నామమాత్రంగా మారిపోతున్నది.

కొరవ 14వ పేజీలో

రాజమోహన్‌రెడ్డి రాద్ధాంతమెందుకు?

నెల్లూరు ఎమ్పీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి స్వరం పెంచాడు. వైఎస్.జగన్ పక్షంగా వకాల్తా తీసుకొని కాంగ్రెస్ అధిష్టానానికి హెచ్చరికలు జారీచేసే స్థాయికి గొంతు హెచ్చించాడు. 27తేది పార్లమెంటు భవనం ముందు టీవీ ఛానళ్ల ఎదుట చాలా తీవ్రంగా మాట్లాడారాయన. జగన్ అనేవాడు లేకుంటే రాష్ట్రంలో కాంగ్రెస్ లేదని, అధిష్టానం జగన్‌ను ఆదరిస్తే వచ్చే ఎన్నికలలో 40 లోక్‌సభ స్థానాలు గెలుస్తామని ప్రకటించాడు.

జగన్ విషయంలో రాజమోహన్‌రెడ్డి ఇంత రాద్ధాంతం చేయడంలో పరమార్థం ఏమిటో కాంగ్రెస్ వాదులెవరికీ బోధపడడం లేదు. కడప – కర్నూలు రోడ్డు పనిలో తన కుమారుడు గౌతమ్‌రెడ్డి, జగన్ భాగస్వాములు కాబట్టి జగన్ పక్షం వహించాడని ఇప్పటివరకు అందరూ భావిస్తున్నారు. దాని కోసమే అయితే అంత పెద్ద గొంతు చేసుకోవాల్సిన అవసరం లేదు. ఆయనేమీ అమాయకుడు కాదు. కాంగ్రెస్ అధిష్టానం శక్తి తెలియని వాడు కాదు. ఢిల్లీ పెద్దలు కన్నెర చేస్తే వ్యాపారాలు సాపారాలు ఎగుడు దిగుడులకు లోనౌతాయన్న నిజం బాగా తెలుసు. ఆయనవన్నీ వేల కోట్ల రూపాయల కాంట్రాక్ట్ పనులు. అయినా సరే అధిష్టానం అభిమతానికి భిన్నమైన రాజకీయ పోకడ అవలంభిస్తున్నాడంటే ఏదో పెద్ద కారణమే వుండాలి.

రాజశేఖర్‌రెడ్డి మీద భక్తి ప్రదర్శిస్తున్నాడని అనుకోలేము. రాజశేఖర్‌రెడ్డితో ఆయనకు అంత అనుబంధం ఏమీ లేదు. వారిద్దరి మధ్య వున్నది కొత్త చుట్టరికం మాత్రమే. జగన్‌తో మనం వూహించలేని స్థాయిలో వున్న డబ్బు లావాదేవీల వల్లనే ఆయన అంత నిబద్ధత ప్రదర్శిస్తున్నాడని పరిశీలకుల అభిప్రాయం. అదే నిజం కావచ్చు.

బాబుకు కలసిరాని బాబ్లీ!

బాబ్లీ ప్రాజెక్ట్‌పై చంద్రబాబు నాయుడు జరిపిన వీరోచిత పోరాటం తెలుగు దేశం పార్టీకి రాజకీయంగా ఎటువంటి లాభమూ చేకూర్చి పెట్టలేదని చెప్తున్నారు. తెలంగాణలో జరిగే ఉపఎన్నికలలో ఈ ఉద్యమ ప్రభావం దాదాపు శూన్యం. ఒక్క స్థానంలో కూడా దాని వల్ల పార్టీ అభ్యర్థులకు ప్రయోజనం కలగలేదు. ఓటర్లు దాన్ని పట్టించుకోలేదు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం కార్యకర్తలలో ఒక కొత్త ఉత్సాహాన్ని కల్గించడంలో మాత్రం కొంతమేర బాబ్లీ ఉపయోగపడింది. గత ఎన్నికలనాటి నుంచి నీరసించి వున్న కార్యకర్తలు బాబ్లీ విషయంలో చంద్రబాబు చూపిన చొరవ, పోరాటపటిమ పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మహానాడు వల్ల కూడా కలగని ఉత్సాహం ఈ ఉద్యమంతో రగిలింది వారిలో.

అయితే ఈ ఉద్యమాన్ని మన రాష్ట్రానికి మాత్రమే పరిమితం చేసి వుంటే బాగుండేదని, మహారాష్ట్రలో ఆగం చేయడం వల్ల అక్కడి తెలుగు వారికి లేనిపోని కష్టాలు తెచ్చి పెట్టిన వారమైనామని కొందరు తెలుగు నేతలు బాధపడుతున్నారు. గతంలో చంద్రబాబు ఏ నిర్ణయం తీసుకొన్నా, ఏ చర్యకు ఉపకరించినా శెబాష్ అని తల వూపడం తప్ప ఎదురు చెప్పే నేత పార్టీలో వుండే వాడు కాదు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. బాబ్లీ విషయంలో బాబు తీరును అశోక్ గజపతి రాజు, కోడెల శివప్రసాద్‌రావు వంటివారు నేరుగానే ప్రశ్నించారు. ఇది తప్పు అని గట్టిగా వాదించారు. ఈ పరిణామం చంద్రబాబుకు మ్రింగుడు పడడం లేదు.

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.